సోమవారం
07-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 135
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేడు అక్టోబరు విప్లవ దినోత్సవం

1917లో రష్యాలో అక్టోబరు విప్లవం విజయవంతమై ప్రపంచంలో ప్రప్రథమ సోషలిస్టు రాజ్యం ఏర్పడింది. ఈ మహత్తర విప్లవానికి వీఐ లెనిన్ నాయకత్వం వహించి విజయవంతం చేశారు. విప్లవం విజయవంతమై 105ఏళ్లు గడిచింది. అక్టోబరు విప్లవం విజయవంతం కావడంతో నిజమైన అధికారం ప్రజలకు దక్కింది. ముఖ్యంగా కార్మికులు, కర్షకులకు విముక్తి కలిగింది. అక్టోబరు విప్లవ విజయోత్సవాన్ని ప్రపంచమంతా కార్మికవర్గం నేడు నిర్వహించుకుంటోంది.

11 మందితో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గం

కార్యవర్గంలోకి మరో నలుగురు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గానికి 11మంది ఎన్నికయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు జరిగాయనీ, ఈ సందర్భంగా పార్టీ అత్యున్నతమైన రాష్ట్ర కార్యదర్శివర్గానికి 11 మంది సభ్యులను, ఇద్దరు ఆహ్వానితులను ఎన్నుకున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం వెల్లడించారు. కె.రామకృష్ణ-రాష్ట్ర కార్యదర్శి, ముప్పాళ్ల నాగేశ్వరరావు-సహాయ కార్యదర్శి, జేవీ సత్యనారాయణమూర్తి-సహాయ కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జి.ఓబులేసు, పి.హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, డి.జగదీశ్, జంగాల అజయ్‌కుమార్, పి.రామచంద్రయ్య ఉన్నారు. ఆహ్వానితులుగా దేగా ప్రభాకర్, కేంద్ర కార్యవర్గం తరపున ఆహ్వానితులుగా అక్కినేని వనజ ఉన్నారు. రాష్ట్ర కార్యవర్గంలోకి మరో నలుగురిని ఆర్.రవీంద్రనాథ్, ఆవుల శేఖర్, సిహెచ్.కోటేశ్వరరావు, ఎ.మారుతీ వరప్రసాద్‌ను తీసుకున్నట్లు రామకృష్ణ వివరించారు. గతంలో 27 మందితో కలిపి కార్యవర్గసభ్యుల సంఖ్య 31 అని, మరో ముగ్గురు కార్యవర్గానికి ఆహ్వానితులుగా ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర సమితికి మరో 25 మందిని కోఆప్ట్ చేసుకున్నామని రామకృష్ణ తెలిపారు.

కె.రామకృష్ణ (కార్యదర్శి)

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ముప్పాళ్ల నాగేశ్వరరావు (సహాయ కార్యదర్శి)

జేవీఎస్ఎన్ మూర్తి (సహాయ కార్యదర్శి)

జల్లి విల్సన్

ఓబులేసు

హరినాథరెడ్డి

ఈశ్వరయ్య

కేవీవీ ప్రసాద్

జగదీశ్

జంగాల అజయ్ కుమార్

రామచంద్రయ్య

ప్రభాకర్

వనజ

ప్రజాస్వామ్య వ్యవస్థకు
జగన్ సర్కార్ పాతర

ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు

- విశాఖలో మోదీకి నిస్సిగ్గుగా వైసీపీ స్వాగతమా?
- 11న రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ నిరసనలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వానికి పోయేకాలం దాపురించిందనీ, ప్రజాస్వామిక వ్యవస్థకు జగన్ ప్రభుత్వం అణచివేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు.

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వానికి పోయేకాలం దాపురించిందనీ, ప్రజాస్వామిక వ్యవస్థకు జగన్ ప్రభుత్వం పాతరేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత విధానాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు, ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలపై త్వరలో సీపీఐ కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోని దాసరిభవన్‌లో ఆదివారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఒక దుర్మార్గమైన, రాక్షస పాలన కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ అనాలోచిత, నిరంకుశ విధానాలపై ఈ నెల 4, 5 తేదీల్లో విజయవాడలో జరిగిన పార్టీ రాష్ట్ర సమితి సమావేశాల్లో సమగ్రంగా చర్చించామన్నారు. మాజీ మంత్రి, టీడీపీ నేత అయ్యన్న పాత్రుడుపై 12 కేసులు పెట్టారని, చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకుంటే తప్పులేదనీ, కాని పోలీసులు అర్ధరాత్రి దొంగల్లా గోడలు దూకి అరెస్ట్ చేయాల్సిన అవసరమేమిటని ప్రశ్నించారు. పోలీసులు బాధ్యత మరచి దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు 41ఏ నోటీస్ ఇవ్వకుండా చర్యలు చేపట్టడమేమిటని ప్రశ్నించారు. పోలీసులను ప్రయోగించి ప్రతిపక్షాల గొంతు నొక్కే

- మిగతా 2 లో

కోవాగ్జిన్‌కి కాలం చెల్లింది!

- వచ్చే ఏడాది కాలం చెల్లిపోనున్న 5 కోట్ల టీకాలు
- తక్షణ వినియోగానికి సిద్ధం... లేని డిమాండు
- ఏడాది ఆరంభంలోనే నిలిచిపోయిన ఉత్పత్తి
- మురిగిపోతే నష్టం తప్పదు: భారత్ బయోటెక్ వర్గాలు

న్యూఢిల్లీ:
కోవిడ్ మహమ్మారి విజృంభినప్పుడు మంచి గిరాకీలో ఉన్న కోవాగ్జిన్ టీకాలు ఇప్పుడు మురిగిపోతున్నాయి. కోట్లాది టీకాలు వినియోగం లేక కాలం చెల్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉత్పత్తిదారు

- మిగతా 2 లో

అంతటా ఆర్థిక
అభద్రత

- 69 శాతం కుటుంబాల పరిస్థితి అదే!
- జీవనం దుర్భలంగా మారిన వైనం
- రూ.15 వేల లోపు ఆదాయం ఉన్న వారిలోనే ఈ దుస్థితి

న్యూఢిల్లీ :
దేశంలో రోజురోజుకీ ప్రజల జీవనం దుర్భలంగా మారుతోంది. చాలీచాలని వేతనాలు, పెరిగిన ఖర్చులతో వారు అల్లాడుతున్నారు. మెరుగైన జీవనం పొందడం వారికి కష్టసాధ్యంగా మారింది. పాలకుల అనాలోచిత, అస్తవ్యస్త ఆర్థిక విధానాలే ఇందుకు కారణమన్నది సుస్పష్టం. ఒక సంస్థ నిర్వహించిన వ్యక్తిగత ఆర్థిక సర్వే ప్రకారం, ఆర్థిక చేరిక, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక సేవల పరిశ్రమలో బలమైన వృద్ధి ఉన్నప్పటికీ, దాదాపు 69 శాతం భారతీయ కుటుంబాలు ఆర్థిక అభద్రత, దుర్భలత్వంతో పోరాడుతున్నాయి. ఈ సర్వే భారతీయ కుటుంబాల ఆదాయం, పొదుపులు, పెట్టుబడి, ఖర్చులను పరిశీలించడం జరిగిందని ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా '4.2 శాతం భారతీయ కుటుంబాల సగటు ఆదాయం నెలకు రూ.23,000 అని సర్వే కనుగొంది. 46 శాతానికి పైగా భారతీయ కుటుంబాలు నెలకు రూ.15,000 కంటే తక్కువ ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. అంటే ఔత్సాహిక లేదా అత్యల్ప ఆదాయ వర్గానికి చెందినవి' అని వివరించింది. భారతదేశ జనాభాలో ఎక్కువ మంది శ్రామిక లేదా మధ్యతరగతికి చెందినవారు ఉన్నారు. ఇక సంపాదన పరంగా కుటుంబాలు నాలుగు తరగతులుగా విభజించారు. 46 శాతం కుటుంబాలు నెలలో 15 వేల కంటే తక్కువ సంపాదిస్తున్నాయి. ఇది ఔత్సాహిక తరగతి. 40 శాతం కుటుంబాలు నెలకు 15-35 వేల మధ్య సంపాదిస్తున్నాయి. ఇవి తక్కువ మధ్య తరగతికి చెందినవి. ఇక నెలకు 35-50 వేలు సంపాదించే 8 శాతం కుటుంబాలు ఉన్నాయి. ఇవి మధ్యతరగతి వారు ఉన్నారు. చివరకు 6 శాతం కుటుంబాలు నెలకు 50 వేల కంటే ఎక్కువ సంపాదిస్తున్నాయి. ఇవి ధనిక/అధిక మధ్యతరగతికి చెందినవి. ఈ వివరాల ద్వారా మనకు అర్థం అయ్యేది ఏమిటంటే దాదాపు సగం భారతీయ కుటుంబాలు నెలకు రూ.15,000 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. 'భారతీయ కుటుంబాలలో కేవలం 3 శాతం మంది మాత్రమే విలాసవంతమైన జీవన ప్రమాణాలను కలిగి ఉన్నారు. వారిలో ఎక్కువ మంది అధిక ఆదాయ వర్గాలకు చెందినవారు. అలాగే, 70 శాతం భారతీయ కుటుంబాలు కొంత ఆర్థిక పొదుపు చేస్తున్నాయని, అవి బ్యాంకు డిపాజిట్లు, బీమా, పోస్టాఫీసు పొదుపులు, బంగారం రూపంలో ఉన్నాయి' అని సర్వే కనుగొంది. అయితే అత్యధికంగా బ్యాంకు, పోస్టాఫీసు పొదుపులు ఉండగా, జీవిత బీమా, బంగారం తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 64 శాతానికి పైగా పొదుపు బ్యాంకు ఖాతాల్లో నిల్వ చేయబడితే, 19 శాతం

- మిగతా 2 లో

బీజేపీ రేపిన
అశాంతి

- హిజాబ్ వివాదం... ముస్లిం వ్యాపారుల బహిష్కరణ
- మునుపెన్నడూ లేనంతగా వరుస హత్యలు
- కర్ణాటకలో కాషాయ శ్రేణుల దుందుడుకు చర్యలు

బెంగళూరు:
కర్ణాటకలో గతంలో ఎన్నడూ లేనంతగా కాషాయ శ్రేణుల దుందుడుకు చర్యలు పెరిగిపోయాయి. హిజాబ్ వివాదం, ముస్లిం వ్యాపారుల బహిష్కరణ, హిజాబ్ నిషేధాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నిరసనలు, కార్యకర్తల వరుస హత్యలు, ముస్లిం యువకుల పై ప్రతీకార

- మిగతా 2 లో

టీఆర్ఎస్‌కే మునుగోడు

10,309 ఓట్లతో గెలుపు

- కలిసి వచ్చిన కమ్యూనిస్టుల స్నేహం
- దేశంలో బీజేపీకి నాలుగు, ఆర్జేడీ, శివసేనకు చెరొకటి

విశాలాంధ్ర - హైదరాబాద్:
తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపిన మనుగోడు ఎన్నికల ఫలితాలు వెల్లడి కాగా టీఆర్ఎస్ విజేతగా నిలిచింది. ఆరు రాష్ట్రాల్లోని ఏడు స్థానాల ఉప ఎన్నికల ఫలితాలు వెలువడగా బీజేపీ నాలుగు, శివసేన, ఆర్జేడీ చెరో ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. మునుగోడులో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తన సమీప అభ్యర్థి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిపై 10,309 ఓట్లతో గెలిచారు. ఈ ఎన్నికల్లో వామపక్షాలు మద్దతు ఇవ్వడంతో టీఆర్ఎస్‌ను విజయం వరించింది. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంలో ఆపార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతికి డిపాజిట్ కూడా రాలేదు. మొత్తం 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగింది. మూడు రౌండ్లలో మాత్రమే బీజేపీ ఆధిక్యం కనబర్చింది. ప్రభాకర్ రెడ్డికి మొత్తం 96,598 ఓట్లు రాగా రాజ్‌గోపాల్ రెడ్డికి 86,485 ఓట్లు వచ్చాయి. స్రవంతికి 23,864, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏస్ పాల్‌కు 805,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇంజినీరింగ్ సీట్ల పాట్లు

- 20 వేలకు పైగా కన్వీనర్ సీట్ల మిగులు
- యాజమాన్య కోటా మరో 30 వేలు
- ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రకటన
- నేటి నుంచి వెబ్ ఆప్షన్లు
- వారం రోజుల్లో కౌన్సెలింగ్ పూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఇంజినీరింగ్ సీట్ల భర్తీలో స్పెషల్ రౌండ్ (ప్రత్యేక విడత) వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌కు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీఈ/బీటెక్‌లో ప్రథమ సంవత్సర ప్రవేశాలకుగాను ఏపీ ఈఏపీసెట్-2022 (ఎంపీసీ-విభాగం)లో అర్హత పొందిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అర్హులు. మొదటి, రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 వేల సీట్లు మిగిలిపోయాయి. ఇందులో కేటగిరి-బి (యాజమాన్య) కోటాలో 30 వేలు, కేటగిరి-ఏ (కన్వీనర్ కోటా)లో 20 వేల సీట్లు ఉన్నాయి. రెండో విడతతోనే వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం నిర్ణయించగా, సీట్లు దక్కని అభ్యర్థులంతా ఏపీఈఏపీసెట్ కన్వీనరుకు ఆన్‌లైన్ ద్వారా వినతులు పంపారు. సీఎం జగన్‌కు ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ ప్రత్యేకంగా లేఖ రాసింది. దీంతో స్పందించి, ఎట్టకేలకు స్పెషల్ రౌండ్ పేరుతో ఈనెల 5వ తేదీన కన్వీనర్ ప్రకటన జారీజేశారు. ఈ ప్రక్రియ 7వ తేదీన ప్రారంభమై, మొత్తం 14వ తేదీతో ముగియనుంది. స్పెషల్ రౌండ్‌కు కేవలం వారం రోజుల వ్యవధితోనే గడువు ఇచ్చారు. ఇంతవరకు సీట్లు దక్కని అభ్యర్థులు, సీట్లు వచ్చినా మంచి బ్రాంచి రాని వారు కౌన్సెలింగ్‌కు సిద్ధమయ్యారు. ప్రతి ఏటా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఆలస్యంగా నిర్వహించడం వల్ల 40 వేల మంది ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలలోని ప్రైవేట్, డీమ్డ్

- మిగతా 2 లో

సీఓపీ 27 సదస్సుకు పాక్ ప్రధాని

7,8 తేదీల్లో షరీఫ్ ఈజిప్టు పర్యటన

ఇస్లామాబాద్: ఈజిప్టులో జరగబోయే ఐరాస వాతావరణ సదస్సులో పాకిస్తాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ పాల్గొనున్నట్లు ఆదేశ విదేశాంగ కార్యాలయం తెలిపింది. షరీఫ్ వెంట విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారి, కేబినెట్ సభ్యులు, సీనియర్ అధికారులు ఉంటారని పేర్కొంది. 27వ ఐరాస వాతావరణ మార్పు సదస్సు (సీఓపీ 27) ఈజిప్టులో జరగనుంది. ఇందుకోసం ఆ దేశానికి వెళ్లనున్న షరీఫ్ అక్కడే రెండు రోజులు ఉంటారని తెలిపింది. ఈనెల 7న షర్మల్ షేక్ వాతావరణ సదస్సులో షరీఫ్ పాల్గొంటారని, 8వ తేదీన సీపీఓ 27కు హాజరవుతారని పేర్కొంది. 6 నుంచి 18వ తేదీ వరకు షర్మల్ షేక్ రిసార్టు పట్టణంలో ఈ సదస్సు జరగనుంది. 'వాతావరణ మార్పు, సున్నిత వర్గాల సుస్థిర'పై 8వ తేదీన జరగబోయే అగ్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి నార్వేజియన్ ప్రధాని జోనస్ గర్హ స్టోర్‌తో కలిసి షరీఫ్ అధ్యక్షత వహించనున్నారు.

యుద్ధ క్షేత్రంలోకి నేరచరితులు

కొత్త చట్టం తెచ్చిన పుతిన్

బెర్లిన్: హత్య, దోపిడీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాతో పాటు రష్యా ఫెడరేషన్ ఫర్ మిలటరీ సర్వీస్ క్రిమినల్ కోడ్ కింద ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడిన రష్యన్లను ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రంలోకి దించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్ణయించారు. ఇందుకోసం చట్టాన్ని తీసుకు వచ్చారు. మైనర్లపై అత్యాచారాలకు పాల్పడిన వారిని, ప్రభుత్వ అధికారుల హంతకులు, ఉగ్రవాదులు లేక ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడిన వారిని తప్పనిసరి సేవల నుంచి మినహాయించారు. ఈ వారం ఉక్రెయిన్‌లో యుద్ధానికి అదనంగా 18వేల మంది సైనికులను పంపినట్లు పుతిన్ వెల్లడించారు. ఇప్పటికే పాక్షిక కార్యకలాపాలు అన్నింటిని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ నిలిపివేసింది. రష్యా-ఉక్రెయిన్‌కు మధ్య తొమ్మిది నెలలుగా యుద్ధం కొనసాగుతోంది. ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులతో దాడులు జరుగుతున్నాయి. ఇటీవల వరుస పేలుళ్లతో కీవ్ దద్దరిల్లింది.

కమికేజ్ డ్రోన్లతో దాడులు జరిగినట్లు ఉక్రెయిన్ అధికారి ఈ మధ్య తెలిపారు. సెప్టెంబరు 21న పుతిన్ పాక్షిక సైనిక సమీకరణ ఉత్తర్వులు జారీ చేసింది.

మానవ హక్కుల్ని గౌరవించండి...

మస్క్‌కు ఐరాస సూచన

జెనీవా: సామాజిక నెట్వర్క్‌కు మానవహక్కులను గౌరవించడం ప్రధానం అని ఐరాస హక్కుల అధ్యక్షుడు వోల్కర్ టర్క్ అన్నారు. ట్విట్టర్ ఉద్యోగుల్లో సగం మందిని తొలగించిన క్రమంలో ఆయన ఆ సంస్థ కొత్త యజమాని ఎలన్ మస్క్‌కు ఒక లేఖ ద్వారా హితవు పలికారు. డిజిటల్ పబ్లిక్ స్వేర్‌లో ట్విట్టర్ పాత్ర కీలకమైన దృష్ట్యా ఉద్యోగుల తొలగింపును ఖండిస్తూ ఐరాసలో మానవహక్కుల హైకమిషనర్ బహిరంగ లేఖ రాశారు. విద్వేష ప్రసంగాలు, తప్పుడు సమాచార వ్యాప్తిని కట్టడి చేయాలని సూచించారు. వినియోగదారుని గోప్యతను పరిరక్షించాలన్నారు. మిగతా కంపెనీల వలె ట్విట్టర్ కూడా ఈ వేదికతో ముడిపడి ఉన్న అంశాలను అర్థం చేసుకోవాలని టర్క్ సూచించారు. మానవహక్కులను గౌరవించాలని కోరుతున్నానని మస్క్ యంత్రాంగాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. టర్క్‌కు ట్విట్టర్‌లో 25వేలమందికిపైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఆయన ఈ లేఖలో ట్విట్టర్‌లోనే పోస్టుచేశారు.

కెన్యాలో కరువు...

1,235 వన్య ప్రాణులు బలి

నైరోబి: ఈ ఏడాది కెన్యాలో కరువు తాండవించింది. ఫిబ్రవరి-అక్టోబరు మధ్య కాలంలో 1,235 వన్యప్రాణులను బలిగొన్నది. కరువు కారణంగా ఆహారం-తాగునీరు లేక మూగజీవాలు అల్లాడిపోయినట్లు ప్రభుత్వ అధికారి తెలిపారు. 14 రకాల వన్యప్రాణులపై తీవ్ర ప్రభావం పడిందని పర్యాటకం, వణ్యప్రాణుల శాఖ కార్యదర్శి పెన్నినా మలోజా తెలిపారు. దక్షిణ, తూర్పు కెన్యాలో పరిస్థితి దారుణంగా ఉండటంతో ముందుగా శాకాహార జీవులు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. మనుషులకు- మూగ/వన్యజీవులకు మధ్య ఘర్షణలను నివారించేందుకు గ్రేవీస్ జీబ్రా, హిప్పో వంటి జంతుజాతులకు గడ్డి/ఆహారం, రక్షిత ప్రాంతాల్లోని వణ్యప్రాణుల కోసం నీటిని ట్రక్కుల్లో సరఫరా చేస్తున్నామని చెప్పారు. కరువు నుంచి ఉపశమనం కోసం వనరులను సమకూరుస్తున్నామన్నారు.

సంక్షోభాల సుడిగుండంలో ప్రపంచం

ఐరాస వాతావరణ చర్చల్లో ప్రతినిధులు

నేడు, రేపు ఈజిప్టులో అంతర్జాతీయ స్థాయి సదస్సు

హాజరుకానున్న 120 దేశాల నేతలు, 40వేల మంది ప్రతినిధులు

షర్మల్ షేక్ (ఈజిప్టు): వరుస సంక్షోభాల సుడిగుండంలో ప్రపంచం చిక్కుకొని ఉన్న వేళ వాతావరణ మార్పుపై చర్చలకు ఐక్యరాజ్య సమితి సిద్ధమైంది. ఈ చర్చల కోసం ఈజిప్టులోని రిసార్టు పట్టణమైన షర్మల్ షేక్‌ను వేదిక చేసుకుంది. ఈనెల 7,8 తేదీల్లో జరగబోయే వాతావరణ సదస్సులో 120 దేశాల నేతలు 40వేల మందికిపైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. వాతావరణపరంగా సంభవించిన భారీ మార్పులు, ప్రపంచంపై ప్రభావం, మరమ్మతుల కోసం బిలియన్ల డాలర్ల వ్యయంపై సదస్సులో చర్చిస్తారు. దీనికంటే ముందు వరుస సంక్షోభాలు, ఉక్రెయిన్‌లో యుద్ధం, అధిక ద్రవ్యోల్బణం, ఆహార కొరతల, ఇంధన సమస్య నడుమ వాతావరణ మార్పు పరిష్కారాలను చర్చించేందుకు ప్రపంచ దేశాల రాయబారులు ఆదివారం భేటీ అయ్యారు. నష్టం-పరిహారం, వాతావరణ మార్పు బాధిత దేశాల స్థితిపై అధికారికంగా చర్చించాలా లేదా అన్నది నిర్ణయించేందుకు ఈ సమావేశానికి ముందు రెండు రోజుల పాటు చర్చోపచర్చలు జరిగాయి. ఐరాస వాతావరణ శాస్త్రవేత్త ప్యానల్ చీఫ్ ప్రారంభోపన్యాసం చేశారు. గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తక్షణమే తగ్గించాలని నొక్కిచెప్పారు. మన గ్రహాన్ని, జీవనోపాధులను రక్షించుకునేందుకు తరతరాల్లో ఒక్కసారే ఇలాంటి అవకాశం లభిస్తుందని వాతావరణ మార్పుపై అంతర్ ప్రభుత్వ ప్యానల్ చైర్ హోసంగ్ లీ అన్నారు. మాజీ చైర్, బ్రిటీష్ అధికారి అలోక్ శర్మ మాట్లాడుతూ, గ్లాస్గో సమావేశం తర్వాత అనేక దేశాల్లో పురోగతి కనిపించిందని చెప్పారు. ఉద్గారాలు తగ్గించాలన్న లక్ష్యాలను ప్రతిష్ఠాత్మకంగా దేశాలు భావిస్తున్నాయని అన్నారు. 2015 పారిస్ ఒప్పందం నిబంధనలు ఖరారు, బొగ్గు వినియోగాన్ని క్రమంగా తగ్గించాలన్న ప్రతిజ్ఞ, శిలాజ ఇంధన కాలుష్యం వంటివి ప్రస్తావించారు. '1.5 డిగ్రీలను (2.7 ఫారెన్‌హీట్)ను ఉంచగలిగాం' అని పారిస్ ఒప్పందం క్రమంలో నిర్దేశిత లక్ష్యాన్ని ఉద్దేశించి ఆయనన్నారు. అయితే మారుతున్న పరిస్థితుల క్రమంలో ఈ ప్రయత్నాలు చాలడం లేదన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం వల్ల ప్రపంచ స్థాయిలో అనేక సంక్షోభాలు సంభవించాయి. ఆహార అభద్రత, ఇంధన కొరత, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు, రుణం పెరగడం వంటివి చుట్టుముట్టాయని శర్మ అన్నారు. అత్యంత సానుకూల పరిస్థితులున్న దేశాల్లోనూ 1.7 సెల్సియస్ వార్మింగ్ సవాల్‌గా మారిందని హెచ్చరించారు. ఈ పరిస్థితి వాతావరణ విపత్తుగా పరిణమించవచ్చునని, ఒక సమయంలో ఒకదానిపైనే కాకుండా అనేక అంశాలపై దృష్టిని కేంద్రీకరించే సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రపంచ నేతలకు ఇంకెన్నిసార్లు మేకొలుపు కావాలి అంటూ అసహనం వ్యక్తంచేశారు. ఇటీవల పాకిస్తాన్, నైజీరియాలో వరదల బీభత్సం సృష్టించడాన్ని, యూరప్‌లోనే కాకుండా అమెరికా, చైనాలో కరవు పరిస్థితులను శర్మ ప్రస్తావించారు. ఇంకా ఏం జరిగితే మేల్కొంటారని ప్రపంచ నేతలను ప్రశ్నించారు. పారిస్ ఒప్పందం లక్ష్యాల సాధనకు ఏ అవకాశాన్ని విడిచిపెట్టవద్దు అని ఈజిప్టు విదేశాంగ మంత్రి సామే షౌర్కీ సూచించారు.

2015 నుంచి 2022 వరకు ఉష్ణవత్సరాలు

న్యూఢిల్లీ: ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 2022లో 1.15 డిగ్రీల సెల్సియస్ పెరిగినట్లు ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) పేర్కొంది. దీంతో 2015 నుంచి 2022 వరకు ఎనిమిదేళ్లు ఉష్ణవత్సరాలని వెల్లడించింది. 'డబ్ల్యూఎంఓ ప్రావిన్షియల్ స్టేట్ ఆఫ్ ది గ్లోబల్ క్లైమేట్ 2022' నివేదికను ఆదివారం యూఎన్ఎఫ్‌సీసీసీకు సంబంధించి 27వ పార్టీల సదస్సులో విడుదల చేశారు. 1993 నుంచి సముద్ర మట్టం రెట్టింపు అయిందని, 2020 జనవరి నుంచి 10 ఎంఎంలు పెరిగిందని, ఈ ఏడాది ఇది రికార్డు అని తెలిపింది. 30ఏళ్ల కిందట శాటిలైట్ కొలతల పద్ధతి మొదలైనప్పటి నుంచి రెండున్నరేళ్లుగా సముద్ర మట్టం 10శాతం పెరగడం గతంలో జరగలేదని నివేదిక పేర్కొంది. ఈ ఏడాది సెప్టెంబరు వరకు లభించిన డేటా ప్రకారం గణాంకాలను నివేదికలో పొందుపర్చగా తుది నివేదిక వచ్చే ఏప్రిల్‌లో వెలువడుతుంది. ఇదే తరహా ఉష్ణోగ్రతలు ఏడాది చివరి వరకు కొనసాగితే 2022 సంవత్సరానికి ఐదవ లేదా ఆరవ ఉష్ణ వత్సరంగా నమోదు చేస్తారని నివేదిక పేర్కొంది. ప్రస్తుతానికి 2015 నుంచి 2022 వరకు ఎనిమిదేళ్లను ఉష్ణ వత్సరాలుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. వర్షాకాలనికి ముందుర అంటే మార్చి, ఏప్రిల్‌లో భారత్, పాకిస్తాన్ దేశాలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాకిస్థాన్‌లో అధిక ఉష్ణోగ్రతలతో పంట దిగుబడి తగ్గిపోయింది. అదే సమయంలో భారత్‌లో గోధుమ, బియ్యం ఎగుమతలపై నిషేదాజ్ఞలు, ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. జులై, ఆగస్టు నెలల్లో రికార్డు స్థాయి వర్షపాతం వల్ల పాకిస్తాన్‌లో వరదలు సంభవించాయి. 1,700 మంది చనిపోగా 3.3 కోట్ల మంది ప్రభావితులయ్యారు. 79 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. భారత్‌లో ముఖ్యంగా జూన్‌లో ఈశాన్య రాష్ట్రాల్లో వర్షాలు-వరదలు బీభత్సం సృష్టించాయి. వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో 700 మంది మరణించగా మరో 900 మంది పిడుగుపాటుకు బలయ్యారు. వరదల కారణంగా అసోంలో 6,63,000 మంది నిరాశ్రయులయ్యారు అని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. 'వార్మింగ్ (ఉష్ణోగ్రత) ఎంత ఎక్కువగా ఉంటే దుష్ప్రభావాలు అంతేస్థాయిలో ఉంటాయి. వాతావరణంలో బొగ్గుపులుసు వాయువు అధిక స్థాయిలో ఉండటంతో పారిస్ ఒప్పందం ప్రకారం 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత తగ్గింపు సుదూర కలగా మిగిలింది' అని డబ్ల్యూహెచ్‌ఓ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ పెట్టెరి తలాస్ పేర్కొన్నారు.

ఎస్ఆర్ఎంలో ముగిసిన ఇండియన్ అకాడమీ సదస్సులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈ నెల 4 నుంచి ప్రారంభమైన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 88వ వార్షిక సదస్సులు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. సదస్సుల నిర్వహణ కన్వీనర్ ప్రొఫెసర్ రంజిత్ థాపా సదస్సుల ముగింపుపై ప్రకటన చేశారు. ఈ నెల 3న ఆంధ్రప్రదేశ్ గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్ యూనివర్సిటీకి విచ్చేసి ఇస్రో, భారత అణు ఇంధన శాఖల వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించగా, 4న ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉమేష్ వీ వాగ్మారే సదస్సులను ప్రారంభించి పరిశోధనలకు సంబంధించిన సమీక్షలకు అంకురార్పణ చేశారు. ఈ మూడు రోజుల సదస్సులకు హాజరైన వివిధ ప్రఖ్యాత యూనివర్సిటీల శాస్త్ర, సాంకేతిక రంగ నిపుణులు వారివారి పరిశోధనాంశాలపై ప్రజంటేషన్ అందించారు. మరికొందరు ఆయా రంగాల్లో జరిగిన పురోగతిని వివరించారు. న్యూఢిల్లీ, ముంబయి, ఖరగ్పూర్, తిరుపతి, కాన్పూర్ ఐఐటీలతో పాటు బనారస్ హిందూ యూనివర్సిటీ (వారణాసి), ఐఐఎస్సీ (బెంగళూరు), టీఐఎస్ఆర్ (ముంబయి) వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు, పరిశోధన సంస్థల నుంచి పేరున్న సైంటిఫిక్ రీసెర్చ్ ఫెలోస్ సుమారు 300 మంది వరకూ సదస్సులకు హాజరయ్యారు. ఇస్రో, డీఏఈ ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను నాలుగు రోజుల్లో 20 వేల మందికి పైగా విద్యార్థులు సందర్శించారు. మూడు రోజుల సదస్సుల్లో ప్రధానంగా నూతన ఆవిష్కరణల పైనే ప్రధానంగా సమీక్షించారు. సదస్సుల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్ డి.నారాయణరావు, కన్వీనర్ రంజిత్ థాపాను గవర్నర్‌తో పాటు వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్ అభినందించారు. ప్రతినిధులందరికీ ఎస్ఆర్ఎం యాజమాన్యం జ్ఞాపికలను ప్రదానం చేసింది. మూడు రోజుల కార్యక్రమాలను విజయవంతం చేసిన వర్సిటీ ఉద్యోగులకు, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కె ఆరోరా, వైస్ చాన్సలర్ ఆచార్య నారాయణరావుకు ధన్యవాదాలు తెలిపారు.

టీఆర్ఎస్‌కే మునుగోడు

(మొదటిపేజీ తరువాయి)

బీఎస్పీకి 4,145 చొప్పున ఓట్లు పొలయ్యాయి. టీఆర్ఎస్ గెలుపుతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు పది రౌండ్లు పూర్తయిన వెంటనే తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులు స్వీట్లు పంచుకుని, టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఉప ఎన్నికకు కారణమైన రాజ్ గోపాల్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడంతో వామపక్షాలు టీఆరెస్‌కు మద్దతు ప్రకటించాయి. బలమైన ఓటు బ్యాంకు ఉండటంతో పాటు వామపక్షాల నాయకులు, కార్యకర్తలు ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం అన్ని విధాలా కృషి చేశారు. వామపక్షాల మద్దతుతోనే గెలిచామని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తెలిపారు.

ఇదిలావుంటే, బీహార్‌లో రెండు, యూపీ, హరియాణా, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో చెరొక స్థానాలకు ఉప ఎన్నిక జరిగింది. బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లో బీజేపీ గెలవగా మొకామాలో ఆర్జేడీ విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్‌లోని గోకర్నాథ్, హరియాణాలోని ఆదంపూర్, బీహార్‌లోని గోపాల్‌గంజ్, ఒడిశాలోని ధామ్‌నగర్‌లో బీజేపీ గెలిచింది. బీహార్‌లోని

మొకామాలో ఆర్జేడీ, ముంబై అంధేరి ఈస్ట్‌లో శివసేన విజయం సాధించాయి. శివసేన తరపున రుతుజా లట్కే పోటీ చేసి 66 వేలకుపైగా ఓట్లతో గెలిచారు. ఆమెకు 86,570 ఓట్లు రాగా నోటాకు 12,806 ఓట్లు వచ్చాయి. 14.79 శాతం ఓట్లతో నోటాకు రెండవ స్థానం వచ్చింది. ఆరుగురు స్వతంత్రులను లట్కే ఓడించారు. శివసేన చీలిక తర్వాత జరిగిన ఎన్నికలు కావడంతో ఈ గెలుపును ఉద్ధవ్ వర్గం వేడుక చేసుకుంది. బీహార్‌లోని మొకామాలో16వేలకుపైగా ఓట్లతో నీలం దేవి విజేతగా నిలిచారు. హరియాణాలోని ఆదంపూర్ నుంచి బీజేపీ అభ్యర్థి భవ్య బిష్ణోయ్ కాంగ్రెస్ తరపు సమీప అభ్యర్థి జైప్రకాశ్‌పై 16వేల ఓట్ల తేడాతో గెలుపుపొందారు. గోపాల్‌గంజ్ (యూపీ)లో బీజేపీ అభ్యర్థి కుసుమ దేవికి 70,032 ఓట్లు రాగా ఆర్జేడీ అభ్యర్థి మోహన్ గుప్తాకు 68,243 ఓట్లు వచ్చాయి. ఒడిశా ధామ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి సూర్యబన్సీ సూరజ్ తన సమీప అభ్యర్థి (బీజేడీ) అవంతి దాస్‌పై 9,881 ఓట్లతో గెలిచారు. సూర్యబన్సీకి 80,351 ఓట్లు రాగా దాస్‌కు 70,470 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి బాబా హరేకృష్ణ సేథికి 3,561 ఓట్లు వచ్చాయి. బీజేపీకి చెందిన అమన్ గిరి 34వేలకుపైగా ఓట్లతో యూపీ గోలాగోకర్నాథ్ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిపై గెలుపొందారు. గిరికి 1,24,810 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి వినయ్ తివారి (ఎస్పీ)కి 90,512 ఓట్లు వచ్చాయి.

అంతటా ఆర్థిక అభద్రత

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాలకు మాత్రమే బీమా ఉంది. మరోవైపు, 22 శాతం భారతీయ కుటుంబాలు స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్, యులిప్, భౌతిక ఆస్తులలో పెట్టుబడి పెట్టినట్లు సర్వేలో తేలింది. అయితే, ఆస్తి/భూమిలో పెట్టుబడి ఎక్కువ (18 శాతం), మ్యూచువల్ ఫండ్స్ (6 శాతం), స్టాక్ మార్కెట్ (3 శాతం), యూనిట్ లింక్డ్ బీమా ప్రణాళికలు లేదా యులిప్‌లు (3 శాతం) ఉన్నాయి. కేవలం 11 శాతం భారతీయ కుటుంబాలు మాత్రమే బ్యాంకులు లేదా ఎన్‌బీఎఫ్‌సీ వద్ద క్రియాశీల రుణాలను కలిగి ఉన్నాయి. అన్ని రిటైల్ రుణాలలో వ్యక్తిగత రుణాల వినియోగం అత్యధికంగా ఉండగా, తరువాత గృహ రుణాలు ఉన్నాయి. భారతీయ కుటుంబాల్లో 'అసురక్షిత' (ఇందులో రూ.15,000 లేదా అంతకంటే ఎక్కువ నెలవారీ సంపాదన ఉన్న కుటుంబాలు ఉన్నాయి). నెలవారీ ఆదాయం రూ.15,000 వరకు ఉన్న కుటుంబాలు అంటే అత్యల్ప ఆదాయం కలిగిన కుటుంబాన్ని చేర్చిన తర్వాత ఆర్థిక అభద్రతా స్థాయి 69 శాతానికి పెరుగుతుంది' అని ఆ ప్రకటన పేర్కొంది. ఈ సర్వే 2022 మే, సెప్టెంబర్ మధ్య నిర్వహించారు.

జగన్ సర్కార్ పాతర

(మొదటిపేజీ తరువాయి)

చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. కోర్టులు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా బుద్ధి రావడం లేదన్నారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న ప్రతిపక్ష నేత చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్లు వేయడాన్ని తప్పుబట్టారు. రహదారులపై గుంతలు పూడ్చలేరు కానీ విస్తరణ పేరుతో ఇళ్లు కూలుస్తున్నారనీ, జనసేన పార్టీ అధ్యక్షుడిగా పవన్ కళ్యాణ్ ఇప్పటం గ్రామానికి బాధితులను పరామర్శించేందుకు వెళ్తుంటే ఆపడమేమిటని, ఆయనకు ఆ గ్రామానికి వెళ్లే హక్కు లేదా ? అని ప్రశ్నించారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) ఉన్నది అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాయడానికా? అని నిలదీశారు. అటు మంత్రులు సైతం ఇష్టానుసారంగా ప్రకటనలు చేయడాన్ని తప్పుపట్టారు. పోలీసులు ఉండేదీ...అధికార పార్టీకి ఊడిగం చేసేందుకా?, చట్టపరంగా వ్యవహరించడానికా? అని ప్రశ్నించారు. ఈ ఇప్పటికైనా జగన్ బుద్ధి తెచ్చుకుని మారాలనీ, లేకుంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై త్వరలోనే సీపీఐ తరఫున కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి వైసీపీకి పూర్తిగా సహకరిస్తోందనీ, అయినా రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, నిధులు రప్పించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారనీ, రాష్ట్రానికి ఏం చేశారనీ 3లక్షల మందితో మోదీకి రాష్ట్ర ప్రభుత్వం స్వాగతం పలకనుందని ప్రశ్నించారు. కేసుల మాఫీ కోసమే మోదీకి ఘనంగా స్వాగతం పలుకుతున్నారా..?, లేక విశాఖ స్టీలు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రం చెప్పినందుకు స్వాగతం పలుకుతున్నారా?, విభజన హామీలను అమలు చేయనందుకు స్వాగతం పలుకుతున్నారా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల సందర్భంగా ఏపీలో వైసీపీ అధికారంలోకి వస్తే, కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను అమలు చేయిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించి, కేవలం మోదీ జపం చేస్తున్నారని విమర్శించారు. మోదీ పర్యటన సందర్భంగా ఈ నెల 11వ తేదీన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిరసిస్తూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని, విభజన హామీలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ శ్రేణులు నిరసన తెలపనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలోని మునుగోడు ఉప ఎన్నికపై రామకృష్ణ మాట్లాడుతూ, అక్కడ రాజగోపాల్‌రెడ్డికి ఏమైందనీ...బీజేపీలోకి చేరి ఎన్నికలకు వెళ్లారని ప్రశ్నించారు. గుజరాత్‌లో రూ.18 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చి బీజేపీలో ఆయనను చేర్చుకుని ఉప ఎన్నికకు వెళ్లారన్నారు.

నిత్యం నీతులు చెప్పే బీజేపీ దిగజారి మునుగోడులో ఎన్నికలకు వెళ్లిందని, అక్కడ కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారని విమర్శించారు. ఈ తరహాగా పెట్టుబడిదారులు, ధనవంతులు, బడా కాంట్రాక్టర్లు ఎన్నికల్లో నిలబడితే, ఇక ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా చర్చ జరగాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్లు, డబ్బులు ఖర్చుపెట్టే వాళ్లు మాత్రమే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికైతే ఇంకా ప్రజాస్వామ్యం ఏం ఉంటుందని ప్రశ్నించారు. వాళ్లంతా ప్రజలను కూడా ప్రభావితం చేస్తున్నారనీ, ఎన్నికల సంస్కరణల కోసం చర్చ జరగాలని రామకృష్ణ అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సీట్ల పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

విశ్వవిద్యాలయాల్లో చేరారు. ఆ ప్రభావంతో కన్వీనర్ కోటాలో 20 వేల సీట్లు మిగిలిపోయాయి. రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం, స్పాట్ అడ్మిషన్లు ఉంటాయనే ఆలోచనతో చాలా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ప్రకటనలు జారీజేశాయి. స్పాట్ అడ్మిషన్ల కింద ప్రవేశాలు పొందిన వారికి ఎలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదు. దాంతోపాటు కన్వీనర్ కోటా ఫీజు కంటే మూడు రెట్ల చొప్పున ఏడాదికి ఫీజు వసూలు చేస్తారు. ఈ విషయాన్ని గమనించిన ఏపీఈఏపీసెట్ అభ్యర్థులు విన్నవించడంతో స్పెషల్ రౌండ్ వెబ్ కౌన్సెలింగ్‌కు ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందితే, అర్హత గల వారందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉంటుంది. ఇప్పటికే నచ్చని కళాశాల/బ్రాంచిలో చేరిన వారంతా, వారి ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా అంతకంటే మెరుగైన స్థానానికి వెళ్లేందుకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు.

ఏపీఈఏపీసెట్ స్పెషల్ రౌండ్ వెబ్ ఆప్షన్ల షెడ్యూలు

ఇంజినీరింగ్ కళాశాలల్లో బీఈ/బీటెక్ ప్రవేశాల కోసం స్పెషల్ రౌండ్ కౌన్సెలింగ్‌కు ప్రకటన జారీజేశారు. ఈ మేరకు ఏపీఈఏపీసెట్-2022 కన్వీనర్ సి.నాగరాణి వివరాలను వెల్లడించారు. మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనకుండా, తొలిసారిగా స్పెషల్ రౌండ్‌లో పాల్గొనే అభ్యర్థులు ఈనెల 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలి. గత రెండు విడతల కౌన్సెలింగ్‌కు హాజరై సీటు పొందిన, లేక సీటు రాని వారంతా ఎలాంటి ఫీజు చెల్లించకుండా, స్పెషల్ రౌండ్‌లో పాల్గొనవచ్చు. 8వ తేదీ నుంచి 9 వరకు ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలను పరిశీలింపజేసుకోవాలి. 11వ తేదీ సాయంత్రం 6 గంటల తర్వాత సీట్లను ఖరారు చేస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులంతా ఆయా కళాశాలల్లో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. పూర్తి వివరాలను ంఎష్ఠ్రవ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం 13 ప్రాంతాల్లో హెల్ప్ లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటి ద్వారా అన్ని పని దినాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 7995681678, 7995865456, 9177927677 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కన్వీనర్ తెలిపారు.

కోవాగ్జిన్‌కి కాలం చెల్లింది!

(మొదటిపేజీ తరువాయి)

కంపెనీకి తీవ్రంగా నష్టం వాటిల్లే అంచనా ఉంది. కోవాగ్జిన్ టీకాలకు డిమాండు తగ్గిపోవడమే ఈ పరిస్థితికి దారితీసినట్లు భారత్ బయోటెక్ కంపెనీ వర్గాలు వెల్లడించాయి. డిమాండు తగ్గిన కారణంగా ఉత్పత్తి నిలిచిపోయింది. 2023 ఆరంభానికే ఐదు కోట్లకు పైగా వాక్సిన్ మోతాదులు కాలం చెల్లిపోనున్నాయి అని పేర్కొన్నాయి. 2021 చివరికల్లా ఏడాదికి బిలియన్ టీకాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఉత్పత్తిదారు కంపెనీ అంచనాలన్నీ తారుమారయ్యాయి.

'భారత్ బయోటెక్ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ. కోవిడ్ వేళ కోవిషీల్డ్‌తో పాటు ఈ కంపెనీ తయారు చేసిన కోవాగ్జిన్ టీకాలు విరివిగా వినియోగించారు. ప్రపంచ దేశాలకు సరఫరా చేశారు. ఇదే క్రమంలో అనేక దేశాల్లో కంపెనీ ఒప్పందాలు కూడా చేసుకుంది. కానీ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఫలితంగా 200 మిలియన్ (20 కోట్లు) కు పైగా కోవాగ్జిన్ టీకాలు మిగిలిపోగా అందులో 50 మిలియన్లు (5 కోట్లు) తక్షణ వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ డిమాండు లేదు. ఈ ఏడాది ఆరంభంలోనే ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో 2023 ఆరంభంలోనే 5 కోట్లకు పైగా కోవాగ్జిన్ టీకాలు కాలం చెల్లిపోనున్నాయి. పర్యవసానంగా కంపెనీకి భారీగా నష్టం వాటిల్లబోతోంది' అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే నష్టం అంచనా ఎంత అన్నది వెల్లడించలేదు.

ఇదిలావుంటే, భారత్‌లో శనివారం 1,082 కోవిడ్ కొత్త కేసులు నమోదయ్యాయి. 15,200 క్రియాశీల కేసులు ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ డేటా ద్వారా తెలుస్తోంది. కోవాగ్జిన్‌తో సహా 219.71 కోట్ల డోసులను ఇప్పటివరకు ప్రజలకు అందించినట్లు డేటా చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇన్ఫెక్షన్ రేటు తగ్గుతుండటంతో కోవాగ్జిన్‌కు డిమాండు తగ్గింది. పరిస్థితులు మెరుగై కోవిడ్-19ని అంతర్జాతీయ స్థాయి ముప్పుగా పరిగణించలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కూడా ఐరాస సేకరణ సంస్థల ద్వారా కోవాగ్జిన్ సరఫరాను నిలిపివేసినట్లు నిర్ధారించింది. ఆ వాక్సిన్ వినియోగించే దేశాలు తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. మార్చి 14-22 తేదీల్లో జరిగిన ఈయూఎల్ (అత్యవసర వినియోగానుమతి) సమీక్ష క్రమంలో సరఫరా నిలిచిపోయినట్లు డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించింది.

కాగా, 2021లో కోవిడ్-19 విజృంభణ వేళ 20 మిలియన్ (2 కోట్ల) కోవాగ్జిన్ డోసులను దిగుమతి నిర్ణయాన్ని బ్రెజిల్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. తమ దేశంలో అధికారులపై దర్యాప్తు క్రమంలో నెలకొన్న వివాదం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రెసికా మెడికామెంటోస్, ఎన్‌విగ్జియా ఫార్మాస్యుటికల్స్ ఎల్ఎల్.సితో బ్రెజిల్ మార్కెట్ కోసం కోవాగ్జిన్ కోవిడ్ వాక్సిన్ సరఫరాకు కుదిరిన అవగాహన ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు 2021, జులై 23న భారత్ బయోటెక్ తెలిపింది. ఉత్పత్తి చేసిన రోజు నుంచి 12 నెలలకు కోవాక్సిన్ టీకా నిల్వ కాలాన్ని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) పొడిగించినట్లు 2021 డిసెంబరులో సంస్థ వెల్లడించింది.

బీజేపీ రేపిన అశాంతి

(మొదటిపేజీ తరువాయి)

హత్యలు రాష్ట్ర ప్రజలను మనస్సులను కదిలించాయి. వారి మానసిక స్థితిపై ప్రభావం చూపాయి. ఏది ఏమైనప్పటికీ, రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు పెరగడానికి పాలక బీజేపీనే కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ధోరణి శాంతిభద్రతల సంస్థల వైఫల్యం, రాజకీయ అనైతికత, అవినీతి, సున్నితత్వం నుంచి ఉద్భవించిందని వాదించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార బీజేపీ దూకుడు హిందుత్వను అనుసరించడానికి సిద్ధంగా ఉంది. కాంగ్రెస్ వ్యతిరేక దిశలో వెళుతున్నందున పరిస్థితి మరింత దిగజారింది. ప్రముఖ విద్యావేత్త, రచయిత, ప్రొఫెసర్ రాధాకృష్ణ ఒక ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ మన సమాజంలో జాగూరక న్యాయం (విజిలెంట్ జస్టిస్) అనే పదానికి స్థానం ఉండదని అన్నారు. 'ఇది చట్టపరమైన కార్యాచరణకు కట్టుబడకుండా మరొక వ్యక్తికి లేదా సామూహిక సమూహానికి శిక్షను సూచిస్తుంది. సరళంగా చెప్పాలంటే, ఇది కంటికి కన్ను అనే సిద్ధాంతం. ఈ విధానం ప్రపంచం మొత్తాన్ని అంధుడిని చేస్తుందని మహాత్మా గాంధీ చెప్పారని మనం గుర్తుంచుకోవాలి' అని ఆయన తెలిపారు. ఇటీవలి కాలంలో కుల సంబంధిత 'పరువు' హత్యలు, మత సంబంధిత, గోహత్య వంటి ఆహార ప్రేరేపిత హింసల పేరుతో కూడా ఇటువంటి దుందుడుకు హింసాత్మక చర్యలు పెరుగుతున్నాయని అన్నారు. దురదృష్టవశాత్తూ, ప్రణాళికాబద్ధంగా లేకపోయినా, రాజకీయ నాయకులు ఎక్కువగా కుటిలత్వంతో అధికారం చేజిక్కించుకోవాలనుకుంటున్నారని, అది సమాజాన్ని విభజించడమేనని ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ అన్ని మతాలచే బోధించబడిన ప్రభుత్వాల 'ధర్మం' అన్ని నొక్కి చెప్పారు. 'ఎవరైనా ఒక మహిళపై అత్యాచారం చేస్తే, మనం వెళ్లి రేపిస్ట్ కుటుంబానికి చెందిన మహిళపై అత్యాచారం చేసి సూపర్ రేపిస్టులుగా మారాలా? హంతకుడిని హత్య చేయడం ద్వారా హత్యకు ప్రతీకారం తీర్చుకోవచ్చా? ఇది నాగరిక సమాజాన్ని అనాగరిక సమాజంగా మారుస్తుంది' అని పేర్కొన్నారు. 'దౌర్జన్యమైన, నేరపూరిత ప్రవర్తన జరిగినప్పుడు మనం మానసికంగా కలవరపడతాం' అని ప్రొఫెసర్ రాధాకృష్ణ తెలిపారు. 'నిజమైన అప్రమత్తమైన న్యాయం అంటే ప్రజాస్వామ్య మార్గంలో న్యాయం పొందేందుకు శాశ్వతమైన జాగరూకత' అని ఆయన అన్నారు. ఒక శక్తివంతమైన నాయకుడి నేతృత్వంలోని శక్తివంతమైన ప్రభుత్వం తమ శాంతియుత గాంధేయ పోరాటానికి లొంగిపోవాల్సి వచ్చిందని పంజాబ్ రైతులు ఇటీవల చూపించారని తెలిపారు. 'మానవజాతి తనను తాను నాగరికంగా, పరస్పరం గౌరవించే సమాజంగా ఎదగడానికి శతాబ్దాలుగా పోరాడుతోంది. అంతిమంగా సత్యం, అహింస ఆధారంగా మహాత్మా గాంధీ చూపిన మార్గమే నిజమైన జాగరూక న్యాయం' అని తెలిపారు. కానీ దురదృష్టవశాత్తు, రాజకీయ వర్గం భిన్నంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోందని అన్నారు. కర్ణాటక కాంగ్రెస్ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ ఎల్.సూర్యముకుంద్రాజ్ మాట్లాడుతూ చట్టం న్యాయాన్ని నిర్ధారిస్తుందని, శిక్షను ఇవ్వడానికి మొత్తం వ్యవస్థను ఏర్పాటు చేసిందని తెలిపారు. 'ప్రైవేటు మూకలు న్యాయం చేయాలంటే, చట్టం, న్యాయవాద, పోలీసింగ్ అవసరం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు. 'రాజ్యాంగం భావప్రకటన, మత స్వేచ్ఛను ఇచ్చింది. ఇతరుల హక్కులను అతిక్రమించకూడదు. రాష్ట్రంలో మూక హత్యలు జరుగుతున్నాయి. ఇది చాలా కలవరపెడుతోంది. కర్ణాటకలోని ఉడిపి జిల్లాలో ఇద్దరు బట్టల వ్యాపారులను కొట్టారు' అని అన్నారు. 2009లో మంగళూరులో జరిగిన పబ్‌పై దాడి కేసును ప్రస్తావిస్తూ, యువతులు ఎలా ప్రవర్తించాలో చెప్పే హక్కు ఏ సంస్థకు ఉందని సూర్యముకుంద్రాజ్ ప్రశ్నించారు. 'ఇదంతా చేస్తున్న వ్యక్తులు హిందూ కార్యకర్తలు. ఇదంతా రాజకీయ కారణాల వల్ల జరిగింది. గోహత్య నిరోధక చట్టాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు' అని తెలిపారు. పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, విజిలెంట్ న్యాయం ఘటనలకు బీజేపీ ప్రభుత్వం మద్దతిస్తోందని నిందించారు. పోలీసులు భారత నేర శిక్షాస్మృతి లేదా, పోలీసు మాన్యువల్ ప్రకారం పనిచేయడం లేదని, 'అజెండా' కోసం పని చేస్తున్నారని అన్నారు. ఇదిలాఉండగా, రాష్ట్రంలో మోరల్ పోలీసింగ్ లేదా అప్రమత్తమైన న్యాయం చేసే అవకాశం ఎవరికీ లేదని బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎన్.జయదేవ్ అన్నారు. వీటిని ప్రతిపక్ష పార్టీల ఆరోపణలుగా కొట్టిపారేశారు. 'ప్రభుత్వం రాష్ట్రానికి బాధ్యత వహిస్తుంది. సమాజంలోని పౌరులందరి బాధ్యతను ప్రభుత్వం చూసుకుంటోంది' అని తెలిపారు.

రాంబిల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్దగల ఎన్ఏఓబీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. రాంబిల్లి నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్ బేస్ (ఎన్ఏఓబీ) ప్రధానద్వారం వద్ద వారం రోజులుగా వేలాది మంది ఎన్ఏఓబీ నిర్వాసితులు, మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి డిమాండు చేస్తున్నారు. వారి న్యాయమైన సమస్యల్ని పరిష్కరించండి అని లేఖలో జగన్‌ను శ్రీనివాసరావు కోరారు. 2005లో ఎన్ఏఓబీ ప్రాజెక్టు నిర్మాణం కోసం 4,800 ఎకరాల భూమి, శారదా, వరాహ నదులను రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల పరిధిలోగల తొమ్మిది గ్రామాల ప్రజలు త్యాగం చేశారని తెలిపారు. 2011లో రాంబిల్లి నుంచి ఉమ్మడి విశాఖ కలెక్టరేట్ వరకు రెండు రోజులు పాటు వేలాది మందితో పాదయాత్ర నిర్వహించారని, అప్పటి కలెక్టర్ లవ్ అగర్వాల్ నిర్వాసితులతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. శారదా, వరాహా నదుల్లో చేపలవేట చేసుకుంటున్న మత్స్యకారుల కోసం జెట్టి నిర్మించే వరకు ఎన్ఏఓబీ నిర్మాణం జరిగినా వేటకు అంతరాయం కలగకుండా చూస్తామని ఆయన ఇచ్చిన హామీకి భిన్నంగా నదులకు ప్రహరీ నిర్మించి వేటకు వెళ్లడానికి గేట్లు పెట్టారని శ్రీనివాసరావు వెల్లడించారు. నిర్వాసితుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడం కోసం సీఎం తక్షణమే జోక్యంచేసుకోవాలని డిమాండు చేశారు. ఇందు కోసం ఎన్ఏఓబీ అధికారులు, నిర్వాసితులతో ఉమ్మడి సమావేశం నిర్వహించాలని ఆయన లేఖలో కోరారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ 11న నిరసనలు

- అదే రోజు విశాఖ ఉక్కు ఉద్యోగుల సమ్మె
- ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని మోదీ విశాఖ వేదికగా ప్రసంగించబోయే బహిరంగ సభలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేయబోమని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నిర్వహిస్తామన్న నిర్దిష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీన తలపెట్టిన నిరసనలను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక పిలుపునిచ్చింది. బహిరంగ సభా వేదికగా విభజన చట్టం అంశాల అమలుపైన, పూర్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి కొనసాగింపు కోసం మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది. విజయవాడలోని దాసరిభవన్‌లో ఆదివారం విశాఖ ఉక్కు పోరాట వేదిక కన్వీనర్- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నర్సింగారావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ, విశాఖకు మోదీ పర్యటనను పురస్కరించుకుని, ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీ నుంచి 12 వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించాలని అక్కడి విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నిర్ణయించిందన్నారు. విశాఖ స్టీల్ పరిరక్షణ కోసం 635 రోజులుగా విశాఖతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయనీ, రాష్ట్రంలో రెండు సార్లు బంద్‌లు, చాలా ఉద్యమాలు జరిగాయని వివరించారు. బీజేపీయేతర పార్టీలన్నీ విశాఖ స్టీలు ఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలని తీర్మానించాయని గుర్తుచేశారు. రాష్ట్ర అసెంబ్లీలోనూ దానిపై తీర్మానించినప్పటికీ, దానికి విలువ లేకుండా పోయిందనీ, సీఎం జగన్‌కు మోదీని ప్రశ్నించే ధైర్యమూ లేదనీ విమర్శించారు. కేంద్రం మాత్రం మొండిగా ముందుకు పోతోందన్నారు. ఈ నిరసనలో అన్ని కార్మిక, యువజన, విద్యార్థి, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడానికి కేంద్రం కుట్రకు పాల్పడుతోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా అందరూ పోరాటాలకు కలిసి రావాలని ఓబులేసు విజ్ఞప్తి చేశారు. నర్సింగరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ను ప్రైవేట్ పరం చేస్తామంటూ కేంద్రం ప్రకటించిన తరుణం నుంచి, ఇవాళ వరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ నెల 11న మోదీ విశాఖ రాక సందర్భంగా ఆ రోజు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు బంద్ నిర్వహిస్తారని, అదే సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర వేదిక పిలుపునిచ్చిందని, దానిని జయప్రదం చేయాలని కోరారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ, ప్రజల త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం నిర్ణయించడం దుర్మార్గమైన చర్యనీ, దీనిని ప్రైవేటీకరిస్తే రాబోయే కాలంలో బడుగు, బలహీన వర్గాల యువతకు రాజ్యాంగపరంగా రావాల్సిన రిజర్వేషన్ ఫలాలు దూరమవుతాయని చెప్పారు. దీనివల్ల ప్రధానంగా త్యాగాలు చేసిన విద్యార్థులు, బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రజల ఆస్తిగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మోదీ పర్యటన నాడు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే నిరసనలో అన్ని వర్గాల ప్రజానీకం భాగస్వామ్యం కావాలని, విశాఖ స్టీల్‌ను పరిరక్షించాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్ కూడా పాల్గొన్నారు.

ఏఆర్‌పేట సొసైటీలో

రుణాల కుంభకోణం?

- భారీగా అవినీతి జరిగిందంటున్న రైతులు
- కట్టిన డబ్బు బకాయికి జమ కాలేదని ఆవేదన

విశాలాంధ్ర-జామి: విజయనగరం జిల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా పేరొందిన అన్నంరాజుపేట వ్యవసాయ పరపతి సహకార సంఘం(పీఏసీఎస్)లో ప్రస్తుతం అవినీతి రాజ్యమేలుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణాల వసూళ్లలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారు. తాము కట్టిన నగదు... పూర్తిగా రికార్డులలో తమ అప్పుకు జమకాలేదని ఆరోపిస్తున్నారు. రికార్డుల్లో ఈ వ్యత్యాసం వేలమీద కాకుండా లక్షల్లో ఉండడంతో ఇప్పుడు సమస్య జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)కు చేరింది. కొద్ది రోజుల క్రితమే డీసీసీబీ డీజీఎం ఉమామహేశ్వరరావు, ఎస్‌కోట బ్రాంచి మేనేజర్ ప్రీతి మానస సొసైటీకి వచ్చి రికార్డులను పరిశీలించారు. రైతుల వాదనలు విన్నారు. ఈసమయంలో రైతులు తాము నగదు కట్టినా ఇంకా అప్పు చూపిస్తున్నారని ఆరోపించారు. అలాగే తాము కట్టిన నగదుకు రశీదులు కూడా ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు అవతవకలపై దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు. ఈసమయంలో కలిసిన విలేకరులకు మాత్రం తాము రుణాల వసూలు కోసం వచ్చామని, ఎటువంటి ఫిర్యాదులు లేవని సెలవిచ్చారు. అంతటితో విషయం ఆగిపోలేదు. పీఏసీఎస్ పరిధిలోని కొంతమంది రైతులు రెండు రోజుల క్రితం డీసీసీబీకి వెళ్లి తమవద్దనున్న రశీదులను చూపించారు. రశీదులోని నగదుకు, జమ అయిన నగదుకు మధ్య వ్యత్యాసాలను గుర్తించినట్లుగా తెలిసింది. దీనిపై రైతుల ఫిర్యాదు మేరకు సోమవారం మరోసారి పూర్తి స్థాయిలో విచారణ చేయనున్నట్లుగా తెలిపారని రైతులు విశాలాంధ్ర ప్రతినిధికి తెలిపారు. రుణాల వసూళ్లతోపాటు ఇతర నిధులను కూడా అక్రమ పద్ధతిలో డ్రా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా సొసైటీకి సంబంధించిన పూర్తి విషయాలు సోమవారం జరిగే విచారణలో బయటపడే అవకాశాలున్నాయి.

విజయవాడలో దారుణం

ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం?

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్: విజయవాడలో దారుణం చోటు చేసుకుంది. బాలికలపై నరరూప రాక్షసుల ఆకృత్యాలు ఆగడం లేదు. పసి మొగ్గలనూ చిదిమేస్తున్నారు. అభం శుభం తెలియని ఎనిమిదేళ్ల చిన్నారిని ఓ మానవ మృగం ఆదివారం కాటేసింది. కూలీ పనులు చేసుకునే తల్లీ దండ్రులకు ఎనిమిదేళ్ల కుమార్తె ఉంది. అదే ప్రాంతానికి చెందిన షేక్. హాఫీజ్ మస్తాన్(45) భార్య వదిలేయడంతో తల్లితో కలిసి నివాసముంటున్నాడు. ఆ బాలిక మావయ్య అంటూ అతని ఇంటికి అడుకునేందుకు వెళ్లేది. ఆ బాలిక పై కన్నేసిన మానవ మృగం అడుకుంటున్న బాలికపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో అప్రమత్తమైన చుట్టుపక్కల వారు వెంటనే స్పందించి బాలికను రక్షించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బాలికను ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.ఈ ఘటనపై దిశా పోలీసులు విచారణ చేపట్టారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు
- తిరుపతిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: పారిశుద్ధ్య కార్మికుల హక్కుల సాధన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు స్పష్టం చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల కోసం తిరుపతి కార్పొరేషన్ సౌజన్యంతో 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కార్మిక సంక్షేమ భవనాన్ని ఇటీవల మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కి అప్పగించడం జరిగింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఆదివారం ఉదయం రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ చేస్తున్న పోరాటాలు చారిత్రాత్మకం అన్నారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో పారిశుద్ధ్యానికి కార్మికులు చేస్తున్న కృషి అమోఘం అన్నారు. కార్మికుల ఐక్యతతో రాష్ట్రంలోనే కార్మికులకు తొలి సొంత భవనాన్ని నిర్మించుకోగలిగారని అభినందించారు. భవిష్యత్తులో కార్మికుల సంక్షేమం కోసం చేసే పోరాటంలో సీపీఐ అగ్ర భాగాన నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంగనాయకులు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ కనీస వేతనాల కోసం ఒకవైపు ఉద్యమాలు, మరోవైపు న్యాయ పోరాటం చేస్తున్నామని తెలిపారు. 26 జిల్లాలలో ఎక్కడా లేని విధంగా తిరుపతిలో కార్మికుల కోసం సొంత యూనియన్ కార్యాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.తులసేంద్ర మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకు పైగా తిరుపతిలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎన్నో పోరాటాలు సాగించి కార్మికుల సంక్షేమం కోసం పని చేసిందని తెలిపారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సందర్భంలో సైతం తిరుపతి పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొని చరిత్రలో నిలిచారని కొని యాడారు. ఈ నేపథ్యంలో కార్మిక సంక్షేమ భవనం కార్మికులకు ఎంతగానో దోహదపడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, నగర కార్యదర్శి రవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దొరస్వామి, జాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలం మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో పని చేసి పదవీ విరమణ పొందిన అనేక మందిని ఘనంగా సన్మానించారు.

సచివాలయ ఉద్యోగుల సభా పోస్టరు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 27న నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ(ఏపీ జీడబ్ల్యూ ఎస్ఈడబ్ల్యూ) రాష్ట్ర మహాజన సభ పోస్టరును ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు, ప్రధాన కార్యదర్శి వైవీరావు ఆవిష్కరించారు. గవర్నర్‌పేట రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల మండల స్థాయి సమీక్ష జరిగింది. బొప్పరాజు, వైవీ రావు మాట్లాడుతూ, ఈనెల 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ (ఏపీ జేఏసీ అమరావతికి అనుబంధం) అధ్వర్యంలో జరగనున్న మహాజనసభకు ప్రతి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి రావాలన్నారు. ఉద్యోగుల ఐక్యతను చాటి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ తరపున కార్యవర్గాలు ఏర్పాటు చేసిన ఘనత ఈ సంఘానిదే అని అన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధ్యక్షులు బి.జగదీష్, జి.దుర్గారావు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌కు ప్రజా సంక్షేమం పట్టదు

మంత్రులు నాగార్జున, జోగి రమేష్ విమర్శ

ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు - వైసీపీ కార్యాలయంలో వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్టదని, అలజడులు-అశాంతి సృష్టించడమే వారి లక్ష్యమని మంత్రులు జోగి రమేష్, మేరుగు నాగార్జున విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను ఎలా తెలుసుకోవాలో వైఎస్ జగన్‌ను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైన తరుణంలో జగన్ చేపట్టిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగన్ ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాల యంలో వేడుకలు నిర్వహించారు. కీశే వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కేక్ కట్ చేశారు. సంకల్పయాత్రలో పాల్గొన్నవారికి వస్త్రాలు, శాలువాలతో సత్కరించారు. మంత్రులు మాట్లాడుతూ, సంవత్సరం మూడు నెలల పాటు జరిగిన పాదయాత్రలో జగన్ సహనం కోల్పోలేదని, పేదల సమస్యలను తెలుసుకుని అధికారంలోకి వచ్చాక వాటి పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల భవిష్యత్తుపై భరోసా ఇచ్చిన నేత జగన్ అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) ప్రసంగించారు. పార్టీ కార్యకర్తల సమన్వయకర్త పుత్తాప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

బోద వ్యాధి నిర్మూలనలో ఏపీ ముందంజ

- ఐదు జిల్లాల్లో సమగ్ర నిర్మూలన
- లెప్రసీలో నివారణలో తూర్పుగోదావరి
- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బోద వ్యాధి నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో నిలిచింది. రాష్ట్రంలోని శ్రీకాకుళం కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఐదు జిల్లాలను కేంద్రం ప్రభుత్వం... బోద రహిత జిల్లాలుగా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం బోద వ్యాధి తీవ్రతను తగ్గించడానికి 2002 నుంచి చాలా కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తోంది. దేశం నుంచి వ్యాధిని పూర్తిగా పారద్రోలేందుకు నేషనల్ వెక్టార్ బార్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్‌వీబీడీసీపీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పది జిల్లాల్లో ఈ వ్యాధి తీవ్రంగా ప్రబలి ఉండేది. దేశ వ్యాప్తంగా ఈ వ్యాధి నిర్మూలనకుగాను 2004లో కేంద్రం రెండు ప్రత్యేకమైన పద్ధతులను ప్రవేశపెట్టింది. సంవత్సర కాలంలో దేశ ప్రజలందరికీ వారి వయస్సుల ఆధారంగా ఒక్క రోజు ఆహారం తీసుకున్న తర్వాత డీఈసీ మందును, అల్బెండజోల్ మందుతో కలిపి ప్రతి ఒక్కరికి మింగించాలని సూచించింది. రెండేళ్లలోపు వయస్సు వారికి ఎలాంటి మాత్రలూ అవసరం లేదు. రెండు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు 100 ఎంజీ డీఈసీ మాత్ర ఒకటి, అల్బెండజోల్ 400 ఎంజీ మాత్ర ఒకటి వంతున వినియోగించాలి. రాష్ట్రంలో వ్యాధి ప్రబలిన 10 జిల్లాల్లో ఈ కార్యక్రమాలను 2004 నుంచి 2013 వరకు వరుసగా పదేళ్లపాటు నిరాఘాటంగా అమలు చేసి, ఐదు జిల్లాల్లో ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించారు.

కుష్టు వ్యాధి నివారణలో 'తూర్పు' ప్రథమం

కుష్టు వ్యాధి(లెప్రసీ) నివారణలో రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా ముందు వరుసలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా, మూడేళ్లలో కొత్త కేసులు నమోదు కాలేదని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. ముందుగా క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామ వలంటీర్ల ద్వారా వివిధ సర్వేలు నిర్వహించి, ఇంటింటికీ కుటుంబ సభ్యులను గుర్తించి వారితో చర్చించడం ద్వారా వ్యాధి వ్యాప్తిపై చైతన్యం కలిగించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా 10వ తేదీన అంగ వైకల్య నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, అవగాహన కల్పిస్తున్నారు. ఈ విజయాలు సాధించిన ఆయా జిల్లాల అధికారులకు వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని, ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ అభినందనలు తెలిపారు.

విప్లవంతోనే సమ సమాజానికి నాంది

ప్రముఖ విశ్లేషకులు డా.రాజశేఖర్

విశాలాంధ్ర-తిరుపతి: నూట ఐదు సంవత్సరాల క్రితం జరిగిన మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవంతో సోవియట్ యూనియన్ ప్రపంచ చరిత్ర గతినే మార్చివేసిందని ప్రముఖ మార్క్సిస్టు విశ్లేషకులు డా. కె.రాజశేఖర్ పేర్కొన్నారు. అక్టోబర్ సోషలిస్టు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి గంధమనేని శివయ్య భవన్ లో సదస్సు నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ... సోవియట్ విప్లవం నూతన సమాజానికి నాంది పలికిందని, దోపిడీ నుంచి విముక్తి కల్పిస్తూ... శ్రామిక, పీడిత ప్రజలలో ఆశను, విశ్వాసాన్ని కలిగిం చిందని చెప్పారు. ఎక్కడైతే ప్రజల శ్రమ గుర్తింపబడుతుందో, గౌరవింప బడుతుందో అక్కడ...శ్రమజీవులు, కర్షకులు, సామాన్య ప్రజలు సృష్టించిన సంపద...కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించబడదన్న విషయం నిరూపితమైందని పేర్కొన్నారు. అక్టోబర్ విప్లవం వలన సోవియట్ యూనియన్‌లో పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అనారోగ్యం మొదలైనవి అతి తక్కువ వ్యవధిలో నిర్మూలింపబడ్డాయన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో భారీ ప్రగతిని సాధించిందన్నారు. సోవియట్ యూనియన్... అత్యంత సంపన్నమైన, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశమైన అమెరికాతో పోటీ పడేలా అన్ని రంగాలలో ఎదురు నిలిచిందన్నారు. బ్రిటీష్ వలసవాదం నుంచి మన దేశ స్వాతంత్ర్యానికి బాటలు వేసిందన్నారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా మత విభజన సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్న ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో పనిచేస్తున్న మోదీ ప్రభుత్వ హయాంలో మనం తిరోగమనం వైపు వెళ్లే దుస్థితి వచ్చిందన్నారు. అలాగే ఎంతో కష్టపడి సాధించుకున్న హక్కుల మీద, ప్రజల ప్రయోజనాలపైన దాడి జరుగుతోందని తెలిపారు. శ్రామిక వర్గానికి, సామాన్య ప్రజలకు...అభ్యుదయ వాదులందరికీ అక్టోబరు విప్లవం స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. ఈసమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యుడు టి. జనార్ధన్, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రమణ ప్రసంగించారు. సభకు తిరుపతి సీపీఐ కార్యదర్శి పి.మురళి అధ్యక్షత వహించగా, నగర కార్యదర్శి విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు..

విశాఖలో విమానాశ్రయాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: భోగాపురం విమానాశ్రయం ఏర్పాటు చేయడం ఆహ్వానించ దగ్గ పరిణామం అని, అయితే విశాఖపట్నంలో ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాన్ని కూడా కొనసాగించాలని యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య కేఎస్ చలం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విశాఖ ప్రయాణీకులకు భోగాపురం చాలా దూరం అవుతుందని, 40 కిలోమీటర్లు దూరంలో ఉండడం వల్ల సామాన్యులు నగరంలోకి రావాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. దేశం లో ఏ విమానాశ్రయం కూడా నగరానికి అంత దూరంలో లేదన్నారు. అందుకే ఇప్పుడు వున్న విశాఖ విమానాశ్రయాన్ని డొమెస్టిక్ ఎయిర్ పోర్టుగా వినియోగించుకునేలా కొనసాగించాలన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంగానే ఉండాలని సూచించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు జిల్లాకు ఒక ఎయిర్ పోర్ట్ అన్న మాట ప్రకారం భోగాపురం విజయనగరం జిల్లా అయితే... విశాఖపట్నం జిల్లాకు ఇప్పుడున్న విమానాశ్రయాన్ని 'విశాఖ ఎయిర్‌పోర్ట్'గా కొనసాగించాలని కోరారు. నగరంలో నేవీకి ఎలాగూ ఎయిర్ పోర్ట్ ఉంటుంది కనుక కొనసాగించడం వల్ల సాధారణ ప్రయాణీకులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. భోగాపురం నుంచి విశాఖ నగరానికి రావడానికి ఎయిర్ ఫెయిర్ కంటే ఎక్కువ టాక్సీ ట్రాన్స్‌పోర్ట్‌కి పెట్టాల్సి ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మార్చి నాటికి ఇంటింటికి తాగునీరు

- రూ.700 కోట్లతో సోమయాజుల పల్లె-డోన్ హైవే
- త్వరలోనే పింఛన్ రూ.2,750కి పెంపు
- పాదయాత్రలో మంత్రి బుగ్గన

విశాలాంధ్ర-డోన్: రూ.350 కోట్ల నిధులతో చేపడుతున్న వాటర్ గ్రిడ్ పథకం ద్వారా డోన్ నియోజకవర్గంలోని మారుమూల పల్లెల్లో సైతం ఇంటింటికి తాగునీరును వచ్చే మార్చి నాటికి అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మొదటగా డోన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోటీ 20 లక్షల రూపాయల నిధులతో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆధునీకరణ, నూతన బోర్లను ప్రారంభించారు. సీఎం జగన్ పాదయాత్ర చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణం సమీపంలోని కోట్లవారిపల్లెలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి చిన్న మల్కాపురం బయలుదేరిన బుగ్గన రెండు కోట్ల 89 లక్షల రూపాయల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన చిన్న మల్కాపురం-పెద్ద మల్కాపురం రోడ్డును ప్రారంభించారు. అనంతరం పెద్ద మల్కాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ సోమయాజులపల్లి నుంచి డోన్ వరకు 700 కోట్ల రూపాయలతో జాతీయ రహదారి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. టీడీపీ నాయకులు ధరలు పెరిగాయంటూ అసత్య ప్రచారాలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరల నియంత్రణ పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందని అన్నారు. త్వరలోనే రూ.2,500గా ఉన్న పింఛన్‌ను రూ.2,750గా పెంచను న్నట్లు చెప్పారు. డోన్‌లో గత 50 ఏళ్ల పాలనలో పాలించిన నాయకులు అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఆర్డీవో వెంకటరెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లంపల్లి రామచంద్రుడు, వైసీపీ నాయకులు డి.కృష్ణ రెడ్డి, నాగ సుబ్బమ్మ, గోపాల్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, గజేంద్రారెడ్డి, పోస్ట్ ప్రసాద్, గోపాల్ రెడ్డి, చిన్న మల్కాపురం సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, బొబ్బల శివరాం రెడ్డి, బుగ్గన జయచంద్ర రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

సాహితి

మహాకవి అల్లామా ఇక్బాల్

యండి. ఉస్మాన్‌ఖాన్,

భారత ఉపఖండ సాహితీ చరిత్రలో ఉర్దూ, ఫార్సీ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అతి కొద్ది మంది కవుల్లో అల్లామా డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ ప్రథములు. ఆయన రాసిన' సారే జహా సె అచ్ఛా.. హిందూసితా హమారా..' దేశభక్తి గీతం నేటికీ భారతీయుల హృదయాలను పరవశింపజేస్తూ, దేశభక్తిని, దేశంపట్ల ప్రేమను ఉద్దీపింపజేస్తున్నది. అల్లామా అని బిరుదాంకితుడైన డాక్టర్ ఇక్బాల్ ప్రఖ్యాత కవి, రచయిత, తత్వవేత్త, సమర యోధుడు, రాజకీయ నాయకుడు. అల్లామా అంటే మహా కవి / మహా పండితుడు అని అర్థం. 1877, నవంబర్ 9 వ తేదీన బ్రిటిష్ ఇండియాలోని సియాల్ కోట్ లో ఇక్బాల్ జన్మించారు. తండ్రి షేఖ్ నూర్ ముహమ్మద్, చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగి. తరువాతి క్రమంలో సొంత వ్యాపారం ప్రారంభించాడు. తల్లి ఇమామ్ బీబీ. తల్లి తండ్రులిద్దరూ చాలా భక్తిపరులు. నిర్మల మనస్సు కలిగిన ధార్మిక వ్యక్తులు. అతి సాధారణ జీవితానికి అంకితమైనవారు.

ఉర్దూ, ఫార్సీ భాషా సాహిత్యాన్ని సుసంపన్న చేసిన మహాకవి డాక్టర్ ఇక్బాల్ ఆధునిక తాత్విక ఆలోచనాపరులు. ఇక్బాల్‌ను షాయిరె మష్రిఖ్ అని కూడా అంటారు. అంటే పాశ్చాత్య కవి అని అర్థం. ఆయన్ని ముఫాకిరె పాకిస్తాన్ అనీ, హకీముల్ ఉమ్మత్ అని కూడా పిలుస్తారు. ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో లాహోరీ ఇక్బాల్‌గా ప్రసిద్ధి చెందారు. ఫార్సీ సాహిత్యంలో ఇక్బాల్ చేసిన కృషి బహుదా ప్రశంసనీయం. పాకిస్తాన్ ప్రభుత్వం ఆయన్ని జాతీయ కవిగా గుర్తించింది. విభిన్న సాహితీ ప్రక్రియల్లో డాక్టర్ ఇక్బాల్ కవిత్వం, కథలు రాశారు. ఆయన మొదటి కవితా సంపుటి అస్రారె ఖుదీ 1915 లో ఫార్సీ భాషలో వెలువడింది. ఇతర కవితా సంపుటాలలో రమూజె బేఖుదీ, పయామె మష్రిఖ్, జబూరె అజం ఉన్నాయి. అలాగే ఆయన ప్రసిద్ధ ఉర్దూ రచనల్లో బాంగె దరా, బాలె జబ్రీల్, జర్ బె కలీమ్, అర్మగానె హిజాజ్ తదితర గ్రంథాలు ప్రముఖమైనవి. షిక్వ, జవాబె షిక్వ పద్య రచనకూడా అత్యంత ప్రసిద్ధమైనది. లాహోర్ ప్రభుత్వ కళాశాల తత్వశాస్త్ర అధ్యాపకుడు సర్ థామస్ ఆర్నాల్డ్ బోధనల ప్రభావం డాక్టర్ ఇక్బాల్ పై చాలా ఉంది. ఆర్నాల్డ్ బోధనల ప్రభావంతోనే పశ్చిమ దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయించుకున్న ఇక్బాల్ 1905లో ఇంగ్లాండుకు వెళ్ళారు. కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కళాశాల నుండి స్కాలర్‌షిప్ కు అర్హత సాధించారు. 1906 లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ పొందారు. అదే సంవత్సరం లింకన్స్ ఇన్ నుండి బారిస్టర్ అయ్యారు. 1907లో డాక్టరేట్ చదవడానికి జర్మనీకి వెళ్లారు. 1908లో మ్యూనిచ్‌లోని లుడ్విగ్ మాక్స్ మిలియన్ విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టా పొందారు. ఫ్రెడరిక్ హెామెల్ మార్గదర్శకత్వంలో పని చేస్తూ, డాక్టర్ ఇక్బాల్ 1908 లో 'ది డెవలప్‌మెంట్ ఆఫ్ మెటాఫిజిక్స్ ఇన్ పర్షియా' పేరుతో తన డాక్టరేట్ థీసిస్‌ను ప్రచురించారు.

ఐరోపాలో చదువుతున్నప్పుడే ఫార్సీ భాషలో చిక్కని కవిత్వం రాయడం ప్రారంభించిన ఇక్బాల్, తన ఆలోచనల ధారను సులభంగా ప్రతిబింబింప జేయడానికి కవిత్వమే సరైన మాధ్యమమని భావించారు. 1899లో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పూర్తి చేసిన తర్వాత, ఓరియంటల్ కాలేజీలో అరబిక్ రీడర్‌గా వృత్తిని ప్రారంభించారు. లాహోర్ ప్రభుత్వ కళాశాలలో తత్వశాస్త్రం బోధించడానికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. 1905లో ఇంగ్లాండుకు వెళ్లే వరకు అక్కడే పనిచేశారు. 1908 లో ఇంగ్లండ్ నుండి తిరిగి వచ్చి మళ్లీ అదే కళాశాలలో తత్వశాస్త్రం, ఆంగ్ల సాహిత్య ప్రొఫెసర్‌గా చేరారు. ఫ్రెడరిక్ నీట్జే, హెన్రీ బెర్గ్ సన్, గోథే వంటి పాశ్చాత్య తత్వవేత్తల ప్రభావం కూడా ఇక్బాల్‌పై అమితంగా ఉంది. మౌలానా రూమీ కవిత్వం, తత్వశాస్త్రం ఇక్బాల్ మనస్సుపై లోతైన ప్రభావాన్ని చూపాయి. చిన్నతనం నుండి ధార్మికభావాలు కలిగిన ఇక్బాల్ ఇస్లాం అధ్యయనం, ఇస్లామీయ నాగరికత, సంస్కృతి, చరిత్ర, రాజకీయం తదితర అంశాలపై దృష్టిపెట్టారు.

రాజకీయ ఉద్యమంలో ప్రవేశించి, ముస్లిం లీగ్‌లో క్రియాశీలక పాత్ర పోషించారు. మౌలానా మొహమ్మద్ అలీ, ముహమ్మద్ అలీ జిన్నా వంటి ముస్లిం రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉన్నారు. జిన్నా నేతృత్వంలోని కాంగ్రెస్ ముస్లిం నాయకుల నుండి సైద్ధాంతిక విబేధాల వల్ల వేరుబడిన తరువాత, 1920 లలో లీగ్‌ను పీడించిన వర్గ విభేదాల కారణంగా ముస్లిం లీగ్ రాజకీయ నాయకుల పట్ల కూడా ఇక్బాల్ నిరాశకు గురయ్యారు. ముహమ్మద్ షఫీ, ఫజ్ లుర్రహమాన్ వంటి నేతల పట్ల ఉన్న భ్రమలు తొలగిపొయ్యాయి. కేవలం ముహమ్మద్ అలీ జిన్నా మాత్రమే ఐక్యతను కాపాడగలడని, ముస్లిం రాజకీయ సాధికారతపై లీగ్ లక్ష్యాలను నెరవేర్చగల రాజకీయ నాయకుడని ఇక్బాల్ నమ్మారు. అందుకే జిన్నాతో బలమైన వ్యక్తిగత స్నేహ సంబంధం ఏర్పరచుకోవడం ద్వారా లండన్‌లో తన స్వయంప్రవాసాన్ని ముగించి, భారతదేశానికి తిరిగి వచ్చి లీగ్‌కు నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా ఒప్పించడంలో డాక్టర్ ఇక్బాల్ ప్రభావవంతమైన పాత్రను పోషించారు. భారతీయ ముస్లింలను లీగ్‌వైపు ఆకర్షించి, ఆంగ్లేయుల ముందు పార్టీని ఐక్యంగా ఉంచగల సామర్థ్యం ఉన్న ఏకైక నాయకుడు జిన్నా మాత్రమే అని ఇక్బాల్ గట్టిగా నమ్మారు. 1930, డిసెంబర్ 29 నాటి తన అధ్యక్ష ప్రసంగంలో ఇక్బాల్, వాయువ్య భారతదేశంలోని ముస్లిం ప్రాబల్య ప్రాంతాలన్నీ కలిపి ఒక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటుచేయాలన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. డాక్టర్ ఇక్బాల్ బ్రిటిష్ ఇండియాలోని ముస్లింల చారిత్రక, రాజకీయ, ధార్మిక, సాంస్కృతిక పత్రికకు మొదటి పోషకుడు. 1935 లో డాక్టర్ ఇక్బాల్ సూచన మేరకు, సయ్యద్ నజీర్ నియాజీ, డాక్టర్ ఇక్బాల్ రచించిన 'తులూయె ఇస్లాం' మకుటంతో ఒక పత్రికను ప్రారంభించారు. ఈ జర్నల్ మొదటి ఎడిషన్‌ను నియాజీ డాక్టర్ ఇక్బాల్‌కు అంకితమిచ్చారు. పాకిస్థాన్ ఉద్యమంలో ఈ పత్రిక కీలక పాత్ర పోషించింది. డాక్టర్ ఇక్బాల్ ఉర్దూ, ఫార్సీ రచనలతో పాటు, ఆంగ్లంలో 'ది డెవలప్‌మెంట్ ఆఫ్ మెటాఫిజిక్స్ ఇన్ పర్షియా', 'ది రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ రిలీజియస్ థాట్ ఇన్ ఇస్లాం' అనే అంశాలపై రెండు గ్రంథాలు, అనేక పత్రాలు వెలువరించారు. వీటిలో పర్షియన్ భావజాలం, ఇస్లామిక్ సూఫీయిజం గురించి తన ఆలోచనలను వెల్లడించారు. తత్వశాస్త్రం, దేవుడు, ప్రార్థన, దాని అర్థం, మానవ ఆత్మ, ముస్లింల సంస్కృతి, అలాగే ఇతర రాజకీయ, సామాజిక, మతపరమైన సమస్యలను కూడా చర్చించారు. పాశ్చాత్య ప్రపంచం పట్ల డాక్టర్ ఇక్బాల్ అభిప్రాయాలను యునైటెడ్ స్టేట్స్ సుప్రీం కోర్ట్ అసోసియేట్ జస్టిస్ విలియం ఓ డగ్లస్ సహా అనేక మంది ప్రముఖులు మెచ్చుకున్నారు. ఇక్బాల్ నమ్మకాలు, ఆదర్శాలు సార్వకాలిక సర్వజనామోదం కలిగి ఉన్నాయని కితాబునిచ్చారు.

ఖచ్చితత్వానికి, నిజాయితీకి డాక్టర్ ఇక్బాల్ మారుపేరు. నిష్క్రియాత్మకతను ఖండించడం, అసమానత, వివక్ష, పీడన, అణచివేతకు వ్యతిరేకంగా ఆయనతెలిపే ధర్మాగ్రహ నిరసన, ఆశావాద జీవితం పట్ల స్పష్టమైన వైఖరి, ప్రపంచంలో మానవుడి లక్ష్యం-ఒక్క మాటలో చెప్పాలంటే, మానవతా వాదం, ప్రజాస్వామ్యం, శాంతి, సామరస్యం, ప్రజల మధ్య స్నేహం సౌహార్ధ్రతలు తదితర అనేక సుగుణాలకు ఆయన నిలువెత్తు చిరునామా. ఇంతటి గొప్ప మనిషి, మహాకవి, పండితుడు, డాక్టర్ అల్లామా ముహమ్మద్ ఇక్బాల్ 1938, ఏప్రిల్ 21న తీవ్రమైన గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా తుది శ్వాస విడిచారు. మంచికీ, మానవతకు, మైత్రీ బంధానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచిన అల్లామా ఇక్బాల్ ను తన జన్మదినం సందర్భంగానైనా గుర్తుచేసుకోవడం, 'సారే జహాసె అచ్ఛా.. హిందూ సితాహమారా..' అని ఆమహనీయుని దేశభక్తి గీతాన్ని గుండెల నిండుగా పాడుకోవడం మనందరి కర్తవ్యం.

(ఈనెల 9న మహాకవి డా. ఇక్బాల్ జయంతి)

గత వర్తమానాల ప్రతీక 'నా కల-నా స్వర్గం'

వేల్పుల నారాయణ, 9440433475

గ్రంథ సమీక్ష

అలుపెరుగని అక్షర సేద్యం చేస్తూ కవయిత్రి విజయ గోలి రాసిన గత వర్తమానాల ప్రతీక 'నాకల-నాస్వర్గం' కవితా సంపుటి. ఇక్కడ కల అంటే గడిచిన జీవిత సత్యం నుండి వెలువడిన అనుభవాల అనుభూతుల పరంపరలో పుట్టిన భావన. ఆ భావనలతో ఉన్నతంగా నిర్మించుకున్న కవితా కుటీరమే తనకు ఆనంద నిలయమని, సంతోషాల సాగరమని, ఆదే తన జీవిత స్వర్గమని చాటుకున్నారు. అందులో కాలుష్యం లేని కవన పవనాలు మాత్రమే ఉంటాయని, అలాంటి స్వర్గాన్ని ఎవరూ హైజాక్ చేయవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. అందుకే అక్షరాయుధాన్ని చేతపట్టారు. కవిత్వం సమాజానికతీతంగా ఉండకూడదు. ఉంటే దానికి సామాజిక ప్రయోజనం శూన్యం. కవి నిబద్ధతకు, ప్రాపంచిక దృక్పథానికి, సామాజిక అవగాహనకు ప్రతిరూపం కవిత్వం. అన్నీ కాకపోయినా అలాంటి చాలా కవితలు ఈ సంపుటిలో పాఠకులను ఆలోచింపచేస్తాయి.

అక్షరాయుధం అనే కవితలో-

'అక్షరాలే ఆయుధం/అజ్ఞానపు అగాధాలు
అధిగమించు సాధనం/ఉద్యమాల శకటానికి
ఊతమిచ్చే ఇంధనం'-అంటూ తన కవితా తాత్విక ప్రయోజనాన్ని ప్రకటించారు. అజ్ఞానపు అంధకారాన్ని పారద్రోలడానికైనా, ఉద్యమ శక్తులకు ఉత్తేజాన్ని ఇవ్వడానికైనా తన కవిత్వం ఉపయోగపడాలని కోరుకుంటున్నారు.

ఇందులో మొత్తం 70 కవితలున్నాయి. అనేక భావ కవితా కుసుమాలున్నప్పటికీ అభ్యుదయ పరిమళాలు వెదజల్లే కవితలు కూడా ఉన్నాయి. సమాజంతో కదులుతూ కదిలింపచేస్తాయి. సామాజిక పరిస్థితులకు అద్దం పడుతాయి. పరిష్కార మార్గాలను ఆలోచింపచేస్తాయి.

ఆవిర్భావం అనే కవితలో-

'ఉదయించే సూర్యుడిగానో/ఉరిమే మేఘంగానో
ఉప్పొంగే సముద్రంగానో/నిప్పుగానో, నింగిగానో
ఏదైనా సరే అందులో నీవుండాలి'..

అంటూ మనిషి వ్యక్తిత్వం ఆవిర్భవించాలని, అందుకు ఆశయం ముఖ్య భూమిక కావాలంటారు. సమాజాన్ని చదివేలా దృష్టి ఏర్పడాలని, అప్పుడే అసలైన వ్యక్తి నిర్మాణం ఆవిర్భవిస్తుందని అంటారు.

వర్ధిల్లు నా భారతమా అనే కవితలో-

'స్వాతంత్ర్య భారతంలో/బానిసత్వపు వేరు బలంగానే ఉంది
చిగురాకులు ఎదుగకుండా/ముల్లుతో చిల్లులు పొడుస్తూ/భావావేశం బ్రద్దలై పోతుంటే/అనుభవం అణగారి పోతుంటే/పేదరికమా నీకు మరణమే లేదు'- అంటూ స్వతంత్ర అమృతోత్సవాలు జరుపుకున్న మనదేశ దుస్థితిని కళ్లకు కట్టినట్లు చూపిస్తారు. లావాల పొంగుతున్న ఉద్వేగం ఏమి చేయలేని చేతగానితనంతో అత్మహత్య చేసుకుంటుందనే ఆవేదనను వ్యక్తపరుస్తారు.

గతవైభవపు స్మృతి ఛాయలు అనే కవితలో-

'స్వర్ణ యుగపు పునాదులపై/దేశమాతకు సమాధి కడుతున్న వర్తమాన పరిస్థితులను చూస్తూ ఆందోళన వ్యక్తపరుస్తారు.

విజయ నీరాజనం, అదేమిటో అనే కవితల్లో 'అవని మీద అతివగా/అంతరంగ సంగ్రామమే/ అనురాగపు ఆవరణలో/అందమైన లక్ష్మణ రేఖలు అంతరిక్షమంత ఎత్తు ఎదిగిన/ఆగవెపుడు నీపై అణచివేతలు/అనాదిగా అరుంధతి నాటినుండి/సంసారపు వలయంలో సాలెపురుగు తానే'-అంటూ ఈ దేశంలో అణచివేయబడుతున్న మహిళల వాస్తవికత దైన్య స్థితికి అద్దం పడుతారు. ఎవరో వస్తారని ఎదురు చూడక అరుణ కిరణాల్లా రెక్కలు విప్పుకొని మేల్కొమ్మని మహిళా లోకానికి పిలుపునిస్తారు. ఒక మహిళగా తాను తన జీవితానుభవంనుండి వాఖ్యానిస్తూ మహిళా సాధికారత కోసం పలువరిస్తారు.

అమ్మా నాన్నలపై అలాగే వృద్ధాప్యంపై అనేకమంది కవితలు రాసినప్పటికి కవయిత్రి తనదైన చూపుతో చక్కగా వ్యక్తీకరించారు.

వాలుపొద్దున రాలు ఆకులు అనే కవితలో-

'రాలిపోవు ఆకులంటే అలుసు ఏల/వాలుపొద్దు బతుకులపై



నా కల నా స్వర్గం(కవిత్వం)-విజయ గోలి
వెల: రు.150/- పేజీలు : 151.
ప్రచురణ: శామ్ పబ్లికేషన్స్.
ప్రతులకు: విజయ గోలి, ఫ్లాట్ నం.305, సాయికృప టవర్స్, కృష్ణానగర్ మేన్ రోడ్, ఇఎస్ఐ హాస్పిటల్ దగ్గర, గుంటూరు-522002.
సెల్.నం. 9704078022

నిరసనేల'- అంటూ ముదిమి ముడతల ముసలితనం అని చులకన చూడవద్దంటారు. పిల్లలను పెంచి పెద్దచేసి బ్రతుకు నేసి అలసి పోయిన వారి త్యాగాన్ని స్ఫురింప చేస్తారు.

అలసి సొలసిన అమ్మా నాన్నకు/ఊతకర్రగా చేయినివ్వు/ నవ్వుతూ సాగనంపే సమయమివ్వు అంటూ వారి సంతానానికి హితబోధ చేస్తారు.

అలాగే హిమాలయ పర్వతం నాన్న, భుజం, అనే కవితల్లో-

ఘర్జిస్తున్న మేఘంలా గాంభీర్యాన్ని కప్పుకున్న/హిమాలయ పర్వతం నాన్న'-అంటూ మన చిన్నతనం నుండి పెంచి పెద్ద చేసిన నాన్న గొప్పతన్నాన్ని, 'నీ మొట్టమొదటి రోదనకు/నీ చిరునవ్వుల జల్లులకు /నీవాడిన తొలి పలుకుకు/అమ్మ స్పందనే ప్రోత్సాహం'- అంటూ అమ్మ గొప్పతనాన్ని కీర్తిస్తారు.

ఉనికి కొరకు పోరు అనే కవితలో-

'జాలరిగా జీవనం/పొద్దు చుక్క పిలుపుతో
సద్దు నిద్దర లేస్తుంది/సముద్రంలో సంబరం
తెరచాపై తేలుతుంది/బతుకు బండి నడిపేందుకు
ఆశనింపి విసురుతున్న వల/ఆటుపోటు
అలలు/సుడిగుండాలెన్నున్న దినదన గండంగా బతుకు పోరాటం చేస్తున్న మత్స్యకారుల జీవితాన్ని, వారి కష్టనష్టాలను ఎంతో హృద్యంగా కవిత్వీకరించారు.

గోడకు చెవులు అనే కవితలో-

'గోడలకే చెవులుంటే పుకారులే శికారులై పూతరేకులు పంచి పెట్టు/ ఇది చాలా అనర్థదాయకమనే భావనతో, గోడచెవులు/మూసి పెట్టు/గుండె తలుపులు తీసి పెట్టు'-అంటూ చక్కని హితబోధచేస్తారు.

ముఖంపై ముసుగుల అనే కవితలో-

'ప్రేముంటే పొంగనీయి/కోపముంటే తరగనీయి/ఈర్ష్య ఉంటే ఇరుగనీయి'-అలా అయితేనే ముఖంలో స్వచ్ఛమైన నవ్వులు వికసిస్తాయంటారు.

కలిమి చెలిమి అనే కవితలో-

స్నేహమంటే పరిమళాలు వెదజల్లే/పారిజాతపు పువ్వులని స్నేహం యొక్క పవిత్రతను, ఔన్నత్యాన్ని గొప్పగా చెప్పారు. అదే విధంగా బాల్యం గురించి, ఆలుమగల అనుబంధం గురించి, నవ్వు వల్ల కలిగే ప్రయోజనాలు, సంతోషాల గురించి, స్వేచ్ఛ గురించి, ఆనందం గురించి, పర్యావరణ కాలుష్యం గురించి, పుస్తకం గురించి అర్థవంతమైన ప్రతీకలతో చక్కని కవితలు మనసును అలరింప చేస్తాయి. జాతి నేతలు గాంధీజీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, అంబేద్కర్, లాల్ బహదూర్ శాస్త్రిల ఘనకీర్తులను ప్రశంసించే కవితలున్నాయి. వీటితో పాటు ఈ సంపుటిలో అనేక భావకవితలు కూడా ఉన్నాయి. ఇవి ఊహల ఉయ్యాలలూగినా భ్రమల పల్లకిలో ఊరేగకుండా జాగ్రత్త తీసుకున్నారు. ఎక్కడా అవి నేల విడిచి సాము చేయలేదు. అభూత కల్పనలు కనిపించలేదు. శిశిరంలో కూడా వసంతాన్ని ఆస్వాదించే ఆశావాదం వ్యక్తపరుస్తారు.

కవయిత్రి అనేక అంశాలపై తన భావాలను చిన్న చిన్న పద బంధాలతో, అక్కడక్కడ అర్థవంతమైన ప్రతీకలతో తనదైనశైలితో చక్కని వ్యక్తీకరణలతో తీసుకువచ్చిన మంచిపుస్తకం ఇది.

ప్రవహిస్తున్న వాక్యం



ఎస్.ఆర్.పృథ్వి,
సెల్: 9989223245

ప్రవాహం నీటికే కాదు
ఆలోచనలకూ ఉంటుంది
ప్రవహించే ఆలోచనలు
అక్షరాలై మొలకెత్తుతాయి
మొలకలు పదాలుగా జతకట్టి
వాక్యాలు ఊపిరి పోసుకుంటాయి
ఒక వాక్యం శిలలను కరిగించే
కరుణ రసాత్మకమై నిలిస్తే
మరొక వాక్యం పీకను తెగ్గోసి
నెత్తురును కాలువల పారిస్తుంది.
ఒక వాక్యం వేడిగాలై ఉసురు తీస్తే
మరొకటి వానచినుకై ప్రాణం నిలుపుతుంది.
ఒక వాక్యం నిలువు కాళ్ల మీద నిలిచి
తుపాకీలాగ పేలితే
మరొకటి మలయ మారుతం లాగ
శాంతి సందేశాన్ని మోసుకెళ్తుంది
వాక్యానికి చలనముంటుంది
వాక్యానికి భావముంటుంది
వాక్యం, భావ మాధుర్యంలో కరిగి
రసరమ్య కావ్యమై జనిస్తుంది
వాక్యానికి రూపమేర్పడుతుంది
వాక్యం అనంతం ప్రవహిస్తానే ఉంటుంది.
వాక్యంతో వాక్యం ముడిపడి
జన బాహుళ్యంలో కలిసేందుకు
చక్కని కథనం అవుతుంది.
పదిమంది తలపుల్లో చేరి
మళ్లీ ఆలోచనల్ని మెరిపిస్తుంది
జత కట్టిన వాక్యాలు
అవినీతిని నిలదీస్తాయి
చైతన్యాన్ని యిమిడ్చుకుని
నిరంతరం నిప్పులాగ రగులుతా ఉంటాయి
వాక్యం మానవ జీవన
పయనానికి మూలకం, కీలకం!

ఆకాశ సంద్రం కురిసీ

ఓ నది ఒడ్డున కలలు పేర్చుకున్న చోట
ఇంత జీవన ప్రయాణానికి
మోసుకొచ్చే దుఃఖానికి ఆనందానికి
నిలువెత్తు సాక్ష్యం ఈ వర్షమే
కొండల్ని పెకలిస్తూ గాలుల్ని ప్రవహిస్తూ
అల్లకల్లోలమైంది కదా ఈ గోదావరి
ఈ వర్షం
కరకట్టల సత్తువని జార్చి
వూళ్ళని కన్నీటముంచి
చిరునామాలు చెరిపేసింది
వాగులు రంకెలేసి దుముకుతున్నాయి
దిక్కుతోచని పిట్టలు
పునరావాస కేంద్రాలని వెతుకుతున్నాయి
మబ్బులు యుద్ధాలు చేసి
అంతంత నీటిని ఒంపుతున్నాయి
లంకలు మునుగుతున్నాయి
అమలిన దృశ్యాల్లో
శూన్యానికి వేలాడుతూ
ప్రాణాలు వేడుకుంటున్నాయి
చూపులు సాయంకోసం
కృత్రిమ పక్షి వైపు చూస్తున్నాయి
మట్టి మనిషి నీట మునిగాక
హృదయాలు చీకటిలో చిక్కుకున్నాక
దుఃఖాశ్రువులు వొలికి
రేపటి ఉనికి ప్రశ్నలు మొలుస్తున్నాయి
ఆకాశ సంద్రం కురిసీ
కుదిపిన జీవితాల
ఆరిన గుండెల ఆవేదన
నలుదిక్కులా నివేదిస్తున్నాయి

-గవిడి శ్రీనివాస్, 7019278368

'ఆకురాలిన చప్పుడు' పుస్తకావిష్కరణ

శ్రీ వశిష్ఠ సోమేపల్లి కవిత్వం 'ఆకురాలిన చప్పుడు' పుస్తకావిష్కరణ 13-11-2022 (ఆదివారం) ఎ.పి.కాటన్ అసోసియేషన్ మీటింగ్ హాల్, లక్ష్మీపురం మెయిన్‌రోడ్, గుంటూరు నందు ఉదయం 10 గంటలకు జరుగును. పెనుగొండ లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహిస్తారు. పుస్తక ఆవిష్కర్త పాపినేని శివశంకర్. స్వీకర్త జరుబుల సౌభాగ్యమ్మ, వక్తలుగా చలపాక ప్రకాష్, అనిల్ డ్యాని, మందరపు హైమావతిలు వ్యవహరిస్తారు. ఎం.సుభాని నిర్వహణలో గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ సభ జరుగును.

సింగినాదం జీలకర్ర

సింగినాదం జీలకర్ర...ఇది తరచుగా వినిపించే ఒక సామెత. సింగినాదం అంటే ఆటవికుల చేతిలో ఉంచుకునే వాద్య పరికరం (దీనిని దుప్పి కొమ్ముతో తయారు చేస్తారు). గతంలో ఓడ రేవులలో సరుకులతో ఒక ఓడ రేవుకు వచ్చిందంటే దాని రాకను తెలియచేస్తూ శంఖారావం లాంటి శబ్దం చేసేవారు. దాంతో ప్రజలు, వ్యాపారస్తులు పొలోమని ఓడ వద్దకు వెళ్లి తమకు కావలసిన వస్తువులు తెచ్చుకునే వారు.

ఓడ రాకను తెలియచేసేదే సింగినాదం. ప్రత్యేకించి ఒక ఓడ మాత్రం అన్నిసార్లూ జీలకర్రతోనే రేవుకు వచ్చేది. సింగినాదం వినపడినా ప్రజలు ఓడ వద్దకు వెళ్లేవారు కాదు.

ఆ... ఏముందిలే జీలకర్రె కదా! అని అనుకుని మిన్నకుండి పోయేవారు. ఆ విధంగా పుట్టిందే ఈ మాట....సింగినాదం జీలకర్ర.

మరో కథనం...

సింగినాదం జానపదుల, గిరిజనులు ఎక్కువగా వాడే కొమ్ము వాయిద్యం. అప్పట్లో మేక, గొర్రె కొమ్ముతో కూడా ఈ వాయిద్య పరికరం తయారు చేసి వాడేవారు. ఈ మేక, గొర్రె కొమ్మును నీటిలో మరిగించి అందులోని గుజ్జును తీసివేసి వాయిద్య పరికరంగా తయారు చేసేవారు. సంస్కృతంలో కొమ్మును శృంగం అని అంటారు. ఆ శృంగనాదమే వాడుకలో సింగి నాదం అయింది. పల్లెటూళ్లలో గిరిజనులు అడవి ప్రాంతాలనుంచి వచ్చి పల్లెటూళ్లలో జీలకర్ర అమ్ముతుండేవారు. అలా అమ్మడానికి వచ్చినప్పుడు శృంగనాదం అదే సింగినాదం ఊదేవారు. అలా వచ్చిందే ఈ 'సింగినాదం జీలకర్ర' అనే సామెత. 'సింగినాదం జీలకర్ర' అంటే చాలా చిన్న విషయం అని.

-కె.వి.వి. ప్రసాద్

అవకాశమివ్వండి... నిరాశపర్చం

- ఆప్ చెప్పినవన్నీ చేయకపోతే మళ్లీ ఓట్లు అడగం
- గుజరాత్‌లో తిరంగా ర్యాలీలో కేజ్రీవాల్
- 'మోర్బీ' దోషుల రక్షణకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపణ

వాంకనెర్: గుజరాత్‌లోని మోర్బీలో తీగల వంతెన కూలి దాదాపు 150 మంది మరణిస్తే, ఆ ఘటనకు బాధ్యులైన వారిని రక్షించేందుకు కొందరు యత్నిస్తున్నారని ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. గుజరాత్‌లో ఆప్ అధికారంలోకి వస్తే మోర్బీ వంతెనను గొప్పగా నిర్మిస్తామని హామీనిచ్చారు. ఆయన ఆదివారం మోర్బీ జిల్లాలోని వాంకనెర్ పట్టణంలో రోడ్ షో (తిరంగా యాత్ర)లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీజేపీ 'డబుల్ ఇంజిన్' అధికారంలోకి వస్తే మోర్బీ తరహా ఘటనలు పునరావృతమవుతాయని అన్నారు. దోషులతో పాలకులకు అనుబంధం ఉందనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఎఫ్ఐఆర్‌లో ఓరేవా గ్రూపు యజమాని పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక్క అవకాశమివ్వాలని గుజరాత్ ప్రజలను కేజ్రీవాల్ కోరారు. ఆ తర్వాత గుజరాత్‌లో మార్పు ఉప్పెన వస్తుందన్నారు. 'మనకు డబుల్ ఇంజిన్ అక్కర్లేదు. కొత్త ఇంజిన్ ప్రభుత్వం కావాలి. డబుల్ ఇంజిన్ తప్పుపట్టిపోయింది. పాతదైంది. నాశనమైంది. మళ్లీ దానిని అధికారంలోకి తెస్తే మోర్బీ వంతెన కూలిపోతుంది. కొత్త ఇంజిన్‌కు అవకాశమిస్తే గొప్పగా మోర్బీ వంతెన నిర్మాణం జరుగుతుంది' అని అధికార బీజేపీని ఉద్దేశించి కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అబద్ధాలు చెప్పే అలవాటు తనకు లేదని అన్నారు. ఆప్ ఇచ్చే ప్రతి హామీ కార్యరూపం దాల్చుతుందని వాగ్దానం చేశారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగాలు వంటి అన్ని చేసిచూపుతామని' కేజ్రీవాల్ అన్నారు. 'నేను విద్యావంతుడను. ఎలా పనిచేయాలో తెలుసు. స్కూళ్లు, ఆసుపత్రులను కట్టించగలను. అబద్ధాలు చెప్పను. మోసపూరిత హామీలు ఇవ్వను. రూ.15లక్షల ఇస్తానని అవాస్తవాలు పలుకను. దిల్లీలో చేసినదాని గురించే మాట్లాడుతున్నాను. నేను నిజాయితీపరుడిని, అవినీతికి పాల్పడను' అని కేజ్రీవాల్ అన్నారు. గుజరాత్ కోసం ప్రణాళిక సిద్ధంగా ఉన్నదని, అందులో పెద్ద సంఖ్యలో ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్‌ల నిర్మాణం, యువతకు ఉద్యోగ కల్పన వంటివి ఉన్నట్లు తెలిపారు. బీజేపీకి 27 ఏళ్లు ఇచ్చారు.. ఆప్‌కు ఐదేళ్లు ఇచ్చి చూడండి.. చెప్పినవన్నీ చేయలేకపోతే మళ్లీ ఓట్లు అడగబోమని ఆయన అన్నారు.

వంకనేర్, చోటిలాలో జరిగిన తిరంగా యాత్రలో పాల్గొన్న కేజ్రీవాల్... నేను మీకు సోదరుడి వంటి వాడిని, ద్రవ్యోల్బణం నుంచి విముక్తి కల్పిస్తానని ప్రజలతో అన్నారు. గుజరాత్‌లో ఆప్ అధికారంలోకి వస్తే మార్చి నుంచి ఉచిత్ విద్యుత్ అందుతుందని కేజ్రీవాల్ హామీనిచ్చారు.

యూపీలో పరువు హత్య

చెల్లిని, ఆమె ప్రియుడిని చంపి పోలీసు స్టేషనలో లొంగిపోయిన అన్న

ఫర్రుఖాబాద్: ఉత్తరప్రదేశ్ పరువు హత్యలకు, అత్యాచారాలకు కేంద్రంగా మారిపోయింది. ఈ రాష్ట్రంలో ప్రేమ నేరం. ప్రేమికులు ఇద్దరిని కుటుంబ సభ్యులు హతమార్చాడం సర్వసాధారణం. తాజాగా ఫర్రుఖాబాద్, రాజేపూర్ సరామేదాలో దారుణం చోటుచేసుకుంది. తన సోదరిని, ఆమె ప్రియుడిని హతమార్చాడు ఓ అన్న. అనంతరం వారి మృతదేహాలను కాలువలో పడవేశాడు. ఈ మేరకు పోలీసులు ఆదివారం తెలిపారు. తన సోదరి శివాణి (23), ఆమె ప్రియుడు రామ్‌కరణ్ (25)ను హత్య చేసినట్లు ఆదివారం తెల్లవారుజామున నగర పోలీసు స్టేషన్‌కు వచ్చి నిందితుడు లొంగిపోయాడని అన్నారు. రామ్‌కరణ్‌తో ప్రేమకు శివాణి కుటుంబం అంగీకరించలేదు అని వారన్నారు. 'శనివారం-ఆదివారం మధ్యరాత్రి శివాణి, రామ్‌కరణ్‌ను పదునైన ఆయుధంతో నీతు హతమార్చాడు. ఆపై మృతదేహాలను కాలువలో పడవేశాడు. తెల్లవారుజామున పోలీసు స్టేషన్‌కు వచ్చి నేరాన్ని అంగీకరించాడు' అని ఎస్పీ అశోక్ కుమార్ మీనా తెలిపారు. రామ్‌కరణ్ తండ్రి మహవీర్ జాతవ్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

బీజేపీ 'డబుల్ ఇంజిన్' మోసాల నుంచి రక్షిస్తాం

గుజరాత్ ప్రజలకు రాహుల్ గాంధీ హామీ

న్యూదిల్లీ: బీజేపీ 'డబుల్ ఇంజిన్' మోసాల నుంచి కాపాడతామని గుజరాత్ ప్రజలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం హామీనిచ్చారు. ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని నొక్కిచెప్పారు. 'రూ.500కే ఎల్పీజీ సిలిండర్, యువతకు 10 లక్షల ఉద్యోగాలు, రూ.3లక్షల వరకు రైతులకు రుణమాఫీ' వంటి 'కాంగ్రెస్ నా8 వచన్'(హామీలు) అమలునకు కాంగ్రెస్ కట్టుబడి ఉన్నట్లు రాహుల్ హిందీలో ట్వీట్ చేశారు. 'మిమ్మల్ని బీజేపీ 'డబుల్ ఇంజిన్' మోసాల నుంచి రక్షిస్తాం. రాష్ట్రంలో 'మార్పు ఉత్సవం' జరుపుకుంటాం' అని పేర్కొన్నారు. గుజరాత్‌లో రెండు దశలుగా డిసెంబరు 1, 5 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 8న ఓట్లను లెక్కిస్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, ఆప్‌కు మధ్య త్రిముఖ పోటీ ఉంది. ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు మూడు పార్టీలు శ్రమిస్తున్నాయి. 2017 ఎన్నికల్లో బీజేపీ 99 స్థానాలు గెలుచుకోగా కాంగ్రెస్ 77 స్థానాలను దక్కించుకుంది. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 స్థానాలు ఉన్నాయి.

విద్వేష శక్తులను తుడిచిపెడతాం: మోదీ

నానా పొందా (గజరాత్): విద్వేషాన్ని వ్యాప్తి చేసి గుజరాత్‌ను అప్రతిష్ఠపాలు చేసిన శక్తులను వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి తుడిచిపెడతామని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అన్నారు. గుజరాత్ ఎన్నికల తేదీలను ప్రకటించిన తర్వాత తన సొంత రాష్ట్రంలో మొదటి ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ' గుజరాత్‌లో ఈసారి బీజేపీ రికార్డు మెజార్టీతో గెలుస్తుందన్న నివేదిక అందుతున్నాయి. నా గత రికార్డులను అధిగమించేందుకు ఇక్కడికి వచ్చాను. మీకు ప్రచారం చేయడానికి వీలైనంత ఎక్కువ సమయం ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నానని గుజరాత్ బీజేపీకి చెప్పాను' అని మోదీ అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా...డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2017 ఎన్నికల్లో మొత్తం 182 స్థానాలకు గాను బీజేపీ 99 స్థానాలను గెలుచుకోగా, కాంగ్రెస్ 77 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎన్నికల బరిలోకి దిగిన దృష్ట్యా త్రిముఖ పోటీ జరుగనుంది.

నా కుమారుడిని దుస్తులు విప్పి సోదా చేశారు

రాజ్యసభ సభ్యుడు అబ్దుల్ వాహబ్ ఆరోపణ

తిరువనంతపురం : యూఏఈ నుంచి తిరిగి వస్తున్న తన కుమారుడిని ఇటీవల అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు అడ్డగించారని, విధి విధానాలు పాటించకుండా దుస్తులు విప్పి సోదా చేశారని రాజ్యసభ సభ్యుడు పీవీ అబ్దుల్ వాహబ్ ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రికి ఫిర్యాదు చేసినట్లు ఐయూఎంఎల్ ఎంపీ తెలిపారు. విధుల్లో ఉన్న కస్టమ్స్ అధికారులు తమ అధికారానికి మించి తన కుమారుడిని ఇక్కడి అనంతపురి ఆసుపత్రికి తీసుకువెళ్లారని, దుస్తులు విప్పి సోదా చేసిన తర్వాత విమానాశ్రయానికి తీసుకురావడానికి ముందు ఎక్స్-రే చేశారని చెప్పారు. 'నాకు అందించిన సమాచారం ప్రకారం, అటువంటి తీవ్రమైన చర్యకు మేజిస్ట్రేట్ ఆమోదం అవసరం. ఇది ఒకరి గోప్యత హక్కును ఉల్లంఘించడం, కస్టమ్స్ నిబంధనలలో అందుకు సంబంధించిన విధానాలు ఉన్నందున కస్టమ్స్ అధికారులు తమంతట తాముగా దీన్ని చేయలేరు' అని ఆయన పేర్కొన్నారు. ఎంపీ ఆరోపణలపై కస్టమ్స్ అధికారికంగా స్పందించకపోగా, విమానాశ్రయంలో ఉన్న అధికారులు తమ విధులను మాత్రమే నిర్వర్తిస్తున్నారని, విదేశాల నుంచి భారత్‌కు అక్రమంగా బంగారం తరలిస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేశామని వాదించారు. బంగారాన్ని శరీరం లోపల దాచి స్మగ్లింగ్ చేసిన సంఘటనలు కూడా ఉన్నాయని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు. ఇదిలాఉండగా, కస్టమ్స్ అధికారులను ఉటంకిస్తూ, వాహబ్ కుమారుడిని దుస్తులు విప్పి సోదా చేయలేదని, ఎంపీ కుమారుడి పై లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) ఉందని కొన్ని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఆసుపత్రిలో తన కుమారుడిని దుస్తులు విప్పి సోదా చేశారని, ఎల్‌వోసీ గురించి తెలియదని ఎంపీ చెప్పారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఎంపీ కొడుకు, వ్యాపారవేత్త, ఇండస్ మోటార్స్ డైరెక్టర్ అని అధికారులకు తెలిసిందని ఆయన చెప్పారు. అనుమానం లేదా ఏదైనా ఫిర్యాదు లేదా కంప్యూటర్‌లో ఫ్లాగ్ చేసినట్లు వారి పేర్లు రావడం వల్ల విమానాశ్రయంలో ఒకరిని అడ్డగించడం, అదుపులోకి తీసుకోవడం సరైంది అయితే, దుస్తులు విప్పి సోదా చేయడం, ఎక్స్-రే వంటి చర్యలు తీవ్రమైన చర్య అని ఆయన అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో వాహబ్ తన ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్తావించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. తన కుమారుడు గడ్డంతో కనిపించడం కస్టమ్స్‌కు అనుమానాన్ని రేకెత్తించిందని అన్నారు. విదేశాలలో వివాహానికి హాజరయి నవంబర్ 1 రాత్రి తన కుమారుడు షార్జా నుంచి తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత ఈ సంఘటన జరిగిందని వివరించారు.

హిమాచల్‌లో బీజేపీ ఓటమి...

విపక్షాల ఐక్యతకు పునాది: కేసీ త్యాగి



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ ఓటమి...2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందు విపక్ష ఐక్యతకు పునాది వేస్తుందని జేడీయూ ప్రధాన కార్యదర్శి కేసీ త్యాగి పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్‌నే గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయిలో బీజేపీకి బలమైన ప్రత్యామ్నాయం అవసరమని, కాషాయ పార్టీని కాంగ్రెస్ మాత్రమే ఓడించగలదని ఆయన అన్నారు. ఆదివారం త్యాగి ఇక్కడి కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'బీజేపీకి బలమైన ప్రత్యామ్నాయం అవసరం...ఇందుకో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రచారాన్ని ప్రారంభించారు. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు ముఖ్యమైనవి... ఎందుకంటే 2024 లోక్‌సభ ఎన్నికలకు ప్రతిపక్షాల ఐక్యతకు పునాది వేయనుంది' అన్నారు. 'ఇక్కడ కాంగ్రెస్ విజయం... 2024 ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మార్గం సుగమం చేస్తుంది' అని ఆయన పీటీఐతో అన్నారు. కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఐక్యత ఉండదని, కాంగ్రెసేతర ప్రతిపక్ష ప్రత్యామ్నాయం కావాలన్నవారితో తాను ఏకీభవించనని తెలిపారు. 'మనం హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీని ఓడిస్తే...అది 2024 ఎన్నికలలో ప్రతిపక్ష ఐక్యత పనిని మాత్రమే కాకుండా, మా ప్రతిజ్ఞను కూడా పూర్తి చేస్తుంది' అని త్యాగి అన్నారు. హార్టికల్చర్ ఉత్పత్తులు, పండ్లను కనీస మద్దతు ధరను తమ పార్టీ కోరుకుంటోందని ఆయన చెప్పారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ విజయావకాశాల గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... కాంగ్రెస్‌కు ఎన్నికలు అనుకూలంగా ఉన్నాయని తాము భావిస్తున్నట్లు చెప్పారు.

జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణను పరిశీలిస్తున్నాం

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

న్యూదిల్లీ : జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో సహకార ఫెడరలిజం-ఆత్మ నిర్భర్ భారత్ వైపు మార్గం' అనే అంశం పై సీతారామన్ మాట్లాడుతూ జమ్ముకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు చేసి... కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించబడిన మూడేళ్ల తర్వాత ఆమె కేంద్ర-రాష్ట్ర సంబంధాల గురించి మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక సంఘం నివేదికను పూర్తిగా ఆమోదించారు. అందుకే ఈ రోజు రాష్ట్రాలకు పన్ను వసూళ్ల ద్వారా 42 శాతం మొత్తం వస్తుంది. ఇప్పుడు జమ్ముకశ్మీర్ రాష్ట్రంగా లేనందున 41 శాతానికి తగ్గించాం. ఇది త్వరలో అవుతుంది. కొంత సమయం పట్టవచ్చు' అని 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేంద్రం రాష్ట్రాలకు నిధుల పంపిణీపై మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా సేవలందిస్తున్నాను. బీజేపీ పాలిత రాష్ట్రాలు లేదా ఇతర పార్టీలు పాలించే రాష్ట్రాల మధ్య తేడా లేదు. ప్రజలందరూ తమలోని శక్తి, మనలోని శక్తి ద్వారా ప్రభుత్వంపై నమ్మకం కలిగి ఉండాలి. ఇది ప్రధానమంత్రి ఎల్లప్పుడూ ప్రోత్సహించే పంక్తి. మొదటిది సామాన్యుల విశ్వాసాన్ని చూరగొనడమేనని, అందులో ఏ రాష్ట్రానికీ తేడా ఉండదని ఆమె అన్నారు. ప్రజల విశ్వాసంపై ఆమె మాట్లాడుతూ 'మీరు మోదీ అని చెప్పలేరు. మీరు ఈ పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించనందున తప్పు చేస్తున్నారు. ఇందులో నిరాకరించడానికి ఏమీ లేదు. అందువల్ల, ప్రధాన మంత్రి ముఖ్యమంత్రిగా ఉన్న విధానం ఏమిటంటే, ఒక వ్యక్తిని నియమించడం ద్వారా మాత్రమే కాకుండా అతను చేసే ప్రతి పనిలోనూ విశ్వాసం పొందడం' అని అన్నారు. 'మీరు పన్ను చెల్లించే డబ్బు నాకు నా జేబులో ఉన్న డబ్బుకు సమానం. నేను సాధారణ కారణం కోసం గరిష్ఠంగా దాన్ని ఉపయోగించాలి. కచ్చితంగా సాధారణ కారణం కోసం తప్ప మరేదైనా డబ్బు ఖర్చు చేసే మార్గం లేదు. అందువల్ల, ఇందులో ఒక ఎత్తుగడగా కూడా, చివరి నినాదం : సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్' అని అన్నారు. 'అందుకే పౌరుడికి సాధికారత కల్పించడం, అతని ప్రాథమిక ఇల్లు ఇవ్వడం, అతని మరుగుదొడ్డి ఇవ్వడం, అతనికి అవసరమైన అవకాశాలను అందించడం, అతనికి బ్యాంకుకు అందుబాటులో ఉండనివ్వడం, తన స్వంత వ్యాపారాన్ని నిర్వహించడానికి రుణాలు తక్కువ మొత్తంలో ఇవ్వడం ప్రభుత్వ విధానం' అని చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆగస్టు 2019లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేసింది. దీని కారణంగా జమ్ముకశ్మీర్ ప్రత్యేక హోదా కోల్పోవడంతో పాటు రాష్ట్ర హోదాను తొలగించి కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది.

చండీగఢ్ విమానాశ్రయానికి భగత్‌సింగ్ పేరు నోటిఫికేషన్ జారీ

న్యూదిల్లీ: చండీగఢ్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా మారుస్తూ పౌర విమానయాన మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌కు నివాళిగా చండీగఢ్ విమానాశ్రయానికి భగత్‌సింగ్ పేరు మార్చనున్నట్లు సెప్టెంబర్ 25న ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సెప్టెంబర్ 28న భగత్‌సింగ్ 115వ జయంతి వేడుకలు నిర్వహించగా... అదే రోజు చండీగఢ్ విమానాశ్రయానికి భగత్ సింగ్ పేరును మార్చినట్లు ప్రకటించారు. విమానాశ్రయాలకు పేర్లు పెట్టడం, పేరు మార్చడంలో విస్తృత ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. కేంద్ర కేబినెట్ తుది ఆమోదం తెలపాలి. సాధారణంగా, విమానాశ్రయాలను అవి ఉన్న నగరం పేరుతో పిలుస్తారు. కొన్ని సందర్భాల్లో, సంబంధిత రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన తీర్మానం ద్వారా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్దిష్ట పేరును ప్రతిపాదిస్తుంది. ఆ తర్వాత తుది ఆమోదం కోసం కేంద్ర మంత్రివర్గానికి పంపుతారు.

హిమాచల్‌లో బీజేపీదే హవా: అమిత్‌షా

నగ్రోటా: హిమాచల్ ప్రదేశ్‌లోని ఎగువ, దిగువ ప్రాంతాలు రెండింటిలోనూ బీజేపీ విజయం సాధిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఇక్కడ కాంగ్రా జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... 'ఈసారి రెడ్ టోపీ, గ్రీన్ టోపీ రెండూ కూడా బీజేపీ అవుతాయి' అని షా అన్నారు. రెండు ప్రాంతాల్లో కాషాయ పార్టీ కాంగ్రెస్‌ను మట్టికరిపిస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ హయాంలో విచ్చలవిడిగా అవినీతి జరిగిందని ఆరోపించిన షా... వారి హామీలను ప్రజలు నమ్మరన్నారు. పదేళ్లు పాలించారు కానీ పెద్ద కుంభకోణాలకు పాల్పడ్డారు... ఇప్పుడు హిమాచల్ ప్రదేశ్ లోని అమాయక ప్రజలను మోసం చేసేందుకు హామీలు గుప్పిస్తున్నారని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోనుద్దేశించి షా అన్నారు. అదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచ వ్యాప్తంగా ఆయన స్థాయి పెరిగిందని చెప్పుకొచ్చారు. రష్యా సైనికచర్య చేపట్టినవేళ ఉక్రెయిన్‌లో భారతీయ విద్యార్థులు చిక్కుకుపోయినప్పుడు, మోదీ రెండు దేశాల అధ్యక్షులతో మాట్లాడారని, భారతీయులను తరలించడానికి రెండు రోజులు యుద్ధాన్ని ఆపాలని కోరారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జై రామ్ ఠాకూర్‌ను ప్రశంసిస్తూ... ఆయన నాయకత్వంలో రాష్ట్రం రూ.44,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని షా చెప్పారు. పోలింగ్‌కు ఆరు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున అమిత్‌షా ఆదివారం రాష్ట్రంలో వరుస ర్యాలీలు నిర్వహించారు. నవంబర్ 12న హిమాచల్ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఎగువ ప్రాంతంలో మండి, కులు, సిమ్లా, సోలన్, కిన్నౌర్, లాహౌల్-స్పితి, సిర్మౌర్, దిగువ ప్రాంతంలో చంబా, ఉనా, కాంగ్రా బిలాస్‌పూర్, హమీర్‌పూర్ ఉన్నాయి.

దిల్లీలో పేలవస్థాయిలో గాలి నాణ్యత

దిల్లీ: జాతీయ రాజధానిలో గాలి నాణ్యత ఆదివారం అత్యంత పేలవస్థాయిలో నమోదైంది. అయితే కనిష్ఠ ఉష్ణోగ్రత 17.5 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడింది. ఇది సీజన్ సగటు కంటే మూడు పాయింట్లు ఎక్కువగా ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) డేటా ప్రకారం... దిల్లీ మొత్తం వాయు నాణ్యత సూచిక (ఏక్యూఐ) మధ్యాహ్నం 1.10 గంటలకు 341 వద్ద ఉంది. అత్యంత పేలవంగా గాలి నాణ్యత సూచికను నమోదు చేసిన దేశ రాజధాని ప్రాంతాలలో అలీపూర్ -357, షాదీపూర్-321, ఎన్ఎస్ఐటి ద్వారక-348, డీటీయూ దిల్లీ-306, ఐటీఓ-335, సిరిఫోర్ట్-351, మందిర్ మార్గ్-333, ఆర్కేపురం-365, ఆయానగర్ -333 ఉన్నాయి. ప్రపంచఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్ఓ)ప్రకారం...15 మైక్రోగ్రాముల వరకు క్యూబిక్ మీటరుకు 24 గంటల సగటు నిమిషానికి 2.5 గాఢత సురక్షితంగా పరిగణించబడుతుంది. దిల్లీలో ప్రమాదకర స్థాయి కాలుష్యంతో అప్రమత్తమైన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పిల్లలను రక్షించే ప్రయత్నంలో శనివారం నుంచి ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తున్నట్లు ప్రకటించారు.

మల్లికార్జున ఖడ్గేకు ఘన స్వాగతం

బెంగళూరు : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖర్గే బెంగళూరుకు రావడం ఇదే తొలిసారి. బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా ఎన్నికయిన పార్టీ జాతీయ అధ్యక్షుడికి మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.కె.శివకుమార్, పార్టీ ఎమ్మెల్యేలు, ఆఫీస్ బేరర్లు స్వాగతం పలికారు. ఆదివారం బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్‌లో 'సర్వోదయ సమావేశ' అనే సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కర్ణాటక పార్టీ ఇన్‌ఛార్జ్ రణదీప్ సింగ్ సూర్జేవాలా కూడా పాల్గొంటారు. ఆరు నెలల్లోపు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో ఎన్నికల బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ బల ప్రదర్శన ఇదేనని ఆ వర్గాలు తెలిపాయి.

కేరళలో అంకుర సంస్థలను ప్రోత్సహించే పథకం

తిరువనంతపురం: తమ ఉత్పత్తులను వాణిజ్యీకరించి, ప్రమాణాలను పెంపొందింప జేయడానికి దేశంలోని ప్రభుత్వ పరిశోధనా సంస్థల నుంచి సాంకేతిక లైసెన్సులను పొందేందుకు కొత్త అంకుర సంస్థలు చేసిన వ్యయాన్ని తిరిగి చెల్లించడానికి కేరళ ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది. కేరళ స్టార్టప్ మిషన్ (కేఎస్‌యుఎం) ద్వారా అమలయ్యే 'సాంకేతిక బదలాయింపు పథకం' అనే ప్రాజెక్ట్ కింద, ప్రభుత్వ పరిశోధనా సంస్థల నుంచి సాంకేతికతను కొనుగోలు చేసే, వాణిజ్యీకరించబడే ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి పని చేసే స్టార్టప్‌లకు ప్రభుత్వం రూ. 10 లక్షల వరకు చెల్లిస్తుంది. కేఎస్‌యూఎం సీఈఓ అనూప్ అంబిక మాట్లాడుతూ... ఈ పథకం రాష్ట్రంలోని స్టార్టప్‌లు తమ ఆలోచనలను మార్కెట్ చేయదగిన ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన పరిజ్ఞానాన్ని మరింతగా పొందేందుకు సహాయపడుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా అందించే ప్రయోజనాలను పొందేందుకు అర్హులైన అంకుర సంస్థల నుంచి కేఎస్‌యూఎం దరఖాస్తులను ఆహ్వానించింది. 'ఇది అత్యంత ప్రతిఫలం అందించే పథకం, అంకుర సంస్థలు ఖర్చు గురించి వెనకాడకుండా వారి ఆలోచనలపై ఆవిష్కరణలు చేయడానికి ప్రోత్సహిస్తుంది' అని అంబిక చెప్పారు.

కుక్కకు ఆహారం పెట్టలేదని కొట్టి చంపాడు

పాలక్కాడ్: పెంపుడు కుక్కకు ఆహారం ఇవ్వడం ఆలస్యం అయిందని బంధువును కొట్టి చంపేశాడో వ్యక్తి. ఈ ఘటన కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో చోటు చేసుకుంది. ముళయంకవు పెరుమ్రతోడిలోని అబ్దుల్ సలాం, అయిషా దంపతుల కుమారుడు అర్షద్(21)... అతని బంధువు హకీమ్(27)తో కలిసి పాలక్కాడ్ జిల్లా మన్నెం గోడ్ లోని అథానిలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. అర్షద్ పెంపుడు కుక్కకు ఆహారం ఇవ్వడం ఆలస్యం కావడంతో హకీమ్ తీవ్రంగా కొట్టాడు. తీవ్ర గాయాలపాలైన అర్షద్‌ను శుక్రవారం స్థానిక వాణియంకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. మేడపై జారి పడిపోయాడని వైద్యులకు చెప్పాడు. కాగా చికిత్స పొందుతూ అదేరోజు అర్షద్ మృతి చెందాడు. అయితే అర్షద్ ఒంటిపై ఉన్న గాయాలు చూసిన వైద్యులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. హకీమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అర్షద్ కుక్కకు ఆహారం ఇవ్వడం ఆలస్యం కావడంతో పెంపుడు కుక్క కనిపించకుండా పోయింది. దీంతో అర్షద్‌ను హకీమ్ కర్ర, బెల్టుతో దారుణంగా కొట్టాడు. అతిని పక్కటెముకలు విరిగిపోయి అంతర్గతర్గ రక్తస్రాక్త వం అయినట్లు వైద్యులు వెల్లడించారు. శనివారం పోలీసులు వీరిద్దరు అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లి సాక్ష్యాలు సేకరించారు. అర్షద్, హకీం ఇద్దరూ ఓ ప్రైవేటు మొబైల్ టెలికాం కంపెనీకి కేబుల్ వర్క్ చేస్తున్నారు. అయితే ఎలాంటి కారణం లేకుండానే అర్షద్‌ను ను, హకీమ్ ఎప్పుడూ కొట్టే వాడని తెలుస్తోంది.

బీజేపీది ప్రజా వ్యతిరేక పాలన

22 అంశాల చార్జిషీటులో కాంగ్రెస్

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తేదీలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ క్రమంగా జోరు పెంచుతోంది. అధికార బీజేపీకి వ్యతిరేకంగా 22 అంశాలతో చార్జిషీటును విడుదల చసింది. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నదని బీజేపీని విమర్శించింది. సగటు గుజరాతీ అనుభవించినది ఆకలి, భయం, నియంత పరిపాలన అని దుయ్యబట్టింది. మోర్బీ ఘటన గురించి చార్జిషీటులో ప్రముఖంగా పేర్కొంది. బిల్కిస్ బానో దోషులు 11 మందికి విముక్తి కల్పించడాన్ని ప్రస్తావించింది. మూడు దశాబ్దాలుగా గుజరాత్‌లో ప్రజా వ్యతిరేక పరిపాలన సాగిందని విమర్శించింది. మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ గర్వించేలా వారు ఆకాంక్షించిన గుజరాత్ నిర్మాణానికి తమ పార్టీని గెలిపించాలని గుజరాత్ ప్రజలను కాంగ్రెస్ కోరింది. ప్రధాన సమస్యలు, కీలక అంశాలపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ యత్నిస్తున్న వేళ ఆయా అంశాలపైకి ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు చార్జిషీటును విడుదల చేసినట్లు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి భరత్‌సిన్హ సోలంకి తెలిపారు. 'మోర్బీ ఘటన... బీజేపీ అవినీతికి నిదర్శనం. ప్రజల ప్రాణాలకు విలువ లేదన్న రీతితో క్రోనీ మిత్రులతో కలిసి ఈ ఘోరానికి బాధ్యత వహించాలి. బిల్కిస్ బానో దోషుల విడుదలను బట్టి మహిళల భద్రత, రక్షణ పట్ల బీజేపీకి ఏ మేరకు చిత్తశుద్ధి ఉన్నది అర్థమవుతుంది. గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్‌ను చాన్సలర్‌గా నియమించిన తర్వాత మహాత్మాగాంధీ స్థాపించిన గుజరాత్ విద్యాపీఠ్‌ను అక్రమ పద్ధతుల్లో దక్కించుకోవాలని అనుకున్నది' అని చార్జిషీటు పేర్కొంది. ప్రభుత్వ ఖజానాను పణంగాపెట్టి అనుకూల పారిశ్రామికవేత్తలకు బీజేపీ ఊడిగం చేసిందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని, పేదరికం పెరగడానికి- నిత్యావసరాల ధరలు అదుపు తప్పడానికి, నిరుద్యోగం తారా స్థాయికి చేరుకోవడానికి దోహదమైందని, విద్య వ్యాపారీకరణ, మహిళలకు భద్రత కరవు, కోవిడ్-19 కట్టడిలో వైఫల్యం, మతఘర్షణలు, ఎస్సీ, ఎస్టీ వర్గీయులతో దుష్ప్రవర్తన, వారిని నిర్లక్ష్యం చేయడం వంటివన్నీ బీజేపీ ప్రభుత్వ విజయాలంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. జీడీపీ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం, అభివృద్ధి గురించి బీజేపీ మాట్లాడుతుందిగానీ విజయ్ రూపాణి సింగిల్ ఇంజిన్ ప్రభుత్వ వైఫల్యంతో మొత్తం పరిపాలన మారిందని సోలంకి అన్నారు. కాంగ్రెస్ గత ప్రభుత్వాలతో పోల్చితే బీజేపీ హయాంలో జీడీపీ 18-23శాతం మేర పెరిగిందని, 1.35శాతం మేర ప్రతికూల వృద్ధి నమోదైందన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పెట్టుబడిదారుల్లో విశ్వాసం సన్నగిల్లడం, రుణ ఉచ్చు, పెరుగుతున్న పేదరికం, అటకెక్కిన ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య బడ్జెట్ తగ్గడం, పౌష్టికాహార లోపం పెరగడాన్ని చార్జిషీటు ప్రస్తావించింది. ఐదేళ్లలో 22 పరీక్షా పత్రాలు లీకయ్యాయని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అలోక్ శర్మ అన్నారు. తమ భవిష్యత్‌తో బీజేపీ ఏ విధంగా చెలగాటమాడిందో గమనంలో ఉంచుకొని ఓటు వేయాలని యువతకు సూచించారు. కనిష్ఠ వ్యవసాయ వేతనాలు, తక్కువ ఎంఎస్‌పీతో రైతులను బీజేపీ మోసం చేసిందని కాంగ్రెస్ చార్జిషీటు పేర్కొంది. 2021లో రోజుకు తొమ్మిది మంది దినసరి వ్యవసాయ కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నట్లు గుర్తుచేసింది.

సభలో అభివాదం చేస్తున్న బెజవాడ విల్సన్, గోప కుమార్, రామచంద్ర, వెంకట్ తదితరులు.

సభకు హాజరైన వారిలో ఒక భాగం.

దళితులపై దాడులనెదుర్కొనేందుకు

ఐక్యంగా ఉద్యమించాలి

- బెజవాడ విల్సన్ పిలుపు
- జనవరిలో రాష్ట్ర స్థాయి సదస్సులు
- 'దేశంలో దళితులపై పెరుగుతున్న దాడులు' జాతీయ సదస్సు నిర్ణయం

న్యూఢిల్లీ: దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, సఫాయి కర్మచారి ఆందోళన్ (ఎస్‌కెఎ) జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్ పిలుపునిచ్చారు. ఇక్కడి హరికిషన్‌సింగ్ సూర్జీత్ భవన్‌లో "దేశంలో పెరుగుతున్న దళితులపై దాడులు" అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఉపాధిలో దళితులకు అన్యాయం జరుగుతోందని, గౌరవప్రదమైన ఉపాధి దక్కడం లేదన్నారు. విద్యా సంస్థల్లోనూ తీవ్ర వివక్షకు గురవుతున్నారని చెప్పారు. కొత్త జాతీయ విద్యా విధానం దళితులకు వినాశకరమని, ప్రైవేటీకరణ కారణంగా ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్లు కుదించుకుపోతున్నాయని విల్సన్ ఆందోళన వ్యక్తంచేశారు. బీకేఎంయూ,ఏఐడీఆర్ఎం, డిఎస్ఎంఎం, ఏఐఏడబ్ల్యూయూ ఎఐఆర్ఎల్ఎ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సదస్సుకు రామచంద్రడోమ్ (డీఎస్ఎంఎం), బి.వెంకట్ (ఏఐఏడబ్ల్యూ యూ) అధ్యక్షత వహించారు. డీఎస్ఎంఎం నేత సుభాషిణీ అలీ దళితులపై దాడులు తదితర అంశాలకు సంబంధించిన ఐదు పేజీల తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

బీకేఎంయూ నాయకులు జీఎస్ గోరియా మాట్లాడుతూ, బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై దాడులు విశృంఖలంగా పెరుగుతున్నాయని విమర్శించారు. ఒకపక్క దళితులపై దాడులు పెరుగుతున్నాయని, మరోపక్క ఎన్డీయే ప్రభుత్వం అమృత్ వేడుకలు నిర్వహిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని తిరస్కరించిన ఆర్ఎస్ఎస్, రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా తిరస్కరిస్తోందని చెప్పారు. దేశంలో అన్ని వర్గాలపై దాడి జరుగుతోందన్నారు. సుభాషిణీ అలీ మాట్లాడుతూ, దళితులు, గిరిజనుల సంక్షేమం కోసం 1980లో ప్రవేశపెట్టిన ప్రత్యేక కాంపోనెంట్ పథకాన్ని మోదీ ప్రభుత్వం దశలవారీగా రద్దు చేసిందని, ఆ తర్వాత దళిత, ఆదివాసీ, ఇతర వెనుకబడిన తరగతుల్లో పేదరికం పెరిగిందని అన్నారు. కేరళ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ చిట్టయం గోపకుమార్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కె. రాధాకృష్ణన్, మాజీ ఎంపీ రాజ్ కుమార్ సైనీ, ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ రతన్ లాల్, మాజీ ఎంపి అలీ అన్వర్, అభిరాణి (ఏఐఎండీఏఎం), భగవంత్ సుమౌ (ఏఐఏఆర్ఎల్ఏ) తదితరులు మాట్లాడారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, ఎమ్మెల్యే కె శాంతకుమారి (డీఎస్ఎంఎం), విక్రమ్ సింగ్ (ఏఐఏడబ్ల్యూయూ), డీఎస్‌పీఎస్ నాయకులు కరవది సుబ్బారావు, జేవీ ప్రభాకర్. బుట్టి రాయప్ప, కేవీపీఎస్ నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, జి రాంబాబు, జాన్ వెస్లీ, స్కైలాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28న రాష్ట్ర కేంద్రాల్లో ఆందోళనలు

దేశంలోని హిందూత్వ మతోన్మాద, ఎన్డీయే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య వేదిక నిర్మాణానికి జాతీయ సదస్సు పిలుపునిచ్చింది. దళితులపై దాడులకు వ్యతిరేకంగా జనవరిలో రాష్ట్రస్థాయిలో సదస్సులు నిర్వహించాలని, ఫిబ్రవరి 28న రాష్ట్ర కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం బలోపేతం చేయాలనీ, ప్రైవేటీకరణ ఆపాలనీ, కాంట్రాక్ట్, తాత్కాలిక కార్మికులను రెగ్యులరైజ్ చేయాలనీ, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు తప్పక అమలు చేయాలనీ, ఎస్సీ, ఎస్టీ కోటా తగ్గించకుండా, దళిత ముస్లిం, క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇవ్వాలనీ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పునరుద్ధరించి, అమలు చేయాలనీ, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలనీ, భూగరిష్ఠ పరిమితి చట్టాన్ని అమలు చేయాలనీ, భూమి లేని పేదలకు భూ పంపిణీ చేయాలనీ సదస్సు డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధనకు పోరాడాలని నిర్ణయించింది.

మహిళా రిజర్వేషన్లపై

కేంద్రానికి సుప్రీం నోటీసు

- ఆరు వారాల్లో అఫిడవిట్ దాఖలుకు ఆదేశం
- ప్రాముఖ్యత కలిగిన అంశాన్ని లేవనెత్తారని ఎన్ఎఫ్ఐడబ్ల్యూకి ప్రశంస

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల అంశంపై ఆరువారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లు-2008ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జేకే మహేశ్వరితో కూడిన ద్విసభ్య ధర్మాసనం పిటిషనర్ ప్రాముఖ్యత కలిగిన సమస్యను లేవనెత్తారని ప్రశంసించింది. కేంద్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కాను అగర్వాల్ వాదనలు వినిపిస్తూ ఈ అంశం నిర్వహణలో తీవ్రమైన సమస్య తలెత్తిందని చెప్పారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 1/3 వంతు రిజర్వేషన్లను ప్రవేశపెట్టడానికి రాజ్యాంగ సవరణను మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతిపాదించిందని తెలిపారు. తొలి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి 25 ఏళ్లు అయిందని చెప్పారు. ఈ బిల్లు 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిందనీ, ఆ తరువాత ఆనాటి లోక్‌సభ రద్దయిందని తెలిపారు. రాజ్యసభ ఆమోదం పొందినప్పటికీ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టలేదని చెప్పారు. బిల్లును ప్రవేశపెట్టకపోవడం ఏకపక్ష, చట్టవిరుద్ధం, వివక్షకు దారితీస్తోందని పేర్కొన్నారు. ఉభయుల వాదనలు విన్న ధర్మాసనం ఆరు వారాల్లో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని, దానికి పిటిషనర్ రిజాయిండర్ అఫిడవిట్ మూడు వారాల్లో దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణను 2023 మార్చి నాటికి వాయిదా వేసింది.

నోట్ల రద్దు జరిగి ఆరేళ్లయినా

ప్రజల వద్ద 30 లక్షల కోట్లు

ముంబై: పెద్ద నోట్ల రద్దు జరిగి ఆరేళ్లు గడిచినా నగదు చలామణి మాత్రం ఇంకా తగ్గలేదు. రోజురోజుకీ కొత్త డిజిటల్ చెల్లింపుల సాధనాలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ నగదుకు మాత్రం ప్రాధాన్యం తగ్గడం లేదు. నోట్ల రద్దు జరిగిన నాటితో పోలిస్తే ప్రజల వద్ద ఉన్న డబ్బు విలువలో 70 శాతానికి పైగా వృద్ధి నమోదు కావడం గమనార్హం. ప్రజల వద్ద ఉన్న నగదు విలువ 2022 అక్టోబరు 21 నాటికి గణనీయంగా పెరిగి రూ.30.88 లక్షల కోట్లకు చేరింది. పెద్ద నోట్లను రద్దు చేసి ఆరేళ్లు గడిచిన తర్వాత కూడా నగదు చలామణి భారీ ఎత్తున కొనసాగుతుండడం గమనార్హం. నోట్ల రద్దును ప్రకటించిన 2016 నవంబరు 4 నాటితో పోలిస్తే ప్రజల వద్ద ఉన్న నగదు విలువ 71.84 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ తాజా గణాంకాలు వెల్లడించాయి. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, నకిలీ కరెన్సీని అరికట్టడం, నల్ల ధనాన్ని వెలికితీయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. 2016 నవంబరు 4 నాటికి ప్రజల వద్ద ఉన్న నగదు విలువ రూ.17.7 లక్షల కోట్లుగా ఉంది. గత నెల 21 కల్లా అది రూ.30.88 లక్షల కోట్లకు పెరిగింది. సాధారణ లావాదేవీలు, వ్యాపార లావాదేవీలు, వస్తువులు-సేవల కొనుగోళ్లకు ఉపయోగించే డబ్బును ప్రజల వద్ద ఉన్న నగదు కింద జమ కడతారు. వ్యవస్థలో మొత్తం చలామణిలో ఉన్న నగదు నుంచి బ్యాంకుల వద్ద ఉన్న డబ్బును తీసివేస్తే ఇది వస్తుంది. కొత్త కొత్త డిజిటల్ చెల్లింపు సాధనాలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ నగదు చలామణి సైతం అదే స్థాయిలో పెరుగుతుండడం గమనార్హం.

ప్రచార వ్యయం తగ్గించాలి

- రూ.10 వేల నుంచి 2 వేలకు ప్రతిపాదన
- కేంద్రానికి పంపిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో మరింత పారదర్శకత, నగదు లావాదేవీలను తనిఖీ చేసేందుకు ఎన్నికల సంఘం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అభ్యర్థుల నగదు వ్యయాన్ని తగ్గించాలని భావిస్తోంది. ఈ మేరకు ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థి ప్రచార ఖర్చుల కోసం నగదు రూపంలో చెల్లించే మొత్తాన్ని ప్రస్తుతం ఉన్న రూ.10 వేల నుంచి రూ.2 వేలకు తగ్గించాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన ప్రతిపాదనలో ఎన్నికల సంబంధిత ఖర్చుల కోసం ఒక వ్యక్తికి లేదా సంస్థకు రూ.2 వేల కంటే ఎక్కువ నగదు చెల్లింపులు ఖాతా చెల్లింపుదారు చెక్కులు లేదా ఆన్‌లైన్ డిజిటల్ మార్గాల ద్వారా జరిగేలా ఎన్నికల నియమావళిని సవరించాలని సిఫార్సు చేసింది. ఎన్నికలలో పోటీ చేసే వ్యక్తిగత అభ్యర్థుల ఖర్చులో మరింత పారదర్శకతను తీసుకురావడానికి, 'అవకతవకలు' తొలగించే ప్రయత్నాలలో ఇది భాగమని ఆ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతానికి, అభ్యర్థులు రూ.10 వేల కంటే ఎక్కువ మొత్తం చెల్లింపులను చెక్కు, డ్రాఫ్ట్ లేదా ఎన్నికల ఖర్చు కోసం ప్రత్యేకంగా తెరిచిన బ్యాంక్ ఖాతా ద్వారా బ్యాంక్ బదిలీ ద్వారా చేసినట్లు నిర్ధారించుకోవాలి. ఈసీ సూచనల ప్రకారం, అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి కనీసం ఒక రోజు ముందు ఎన్నికల ఖర్చు ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా ప్రత్యేక బ్యాంక్ ఖాతాను తెరవాలి. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఫలితాల ప్రకటన తేదీ వరకు (రెండు తేదీలతో కలిపి) రోజువారీ ఖాతాలు, నగదు పుస్తకం, బ్యాంక్ పుస్తకాన్ని నిర్వహించాలి. వారు నామినేషన్ దాఖలు చేసిన తేదీకి అయ్యే ఖర్చులన్నింటినీ కూడా చేర్చాలి. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30 రోజులలోపు అభ్యర్థి ఎన్నికల వ్యయ ఖాతాను జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలి. గుజరాత్ లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల ఖాతాల్లో రూ.10 లక్షలకు పైగా అనుమానాస్పద లావాదేవీలపై నిఘా ఉంచాలని ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశించింది. ఈ మేరకు ఆదివారం అధికారులు సమాచారం అందించారు. లక్ష రూపాయల కంటే ఎక్కువ లావాదేవీలు జరిపిన అభ్యర్థుల ఖాతాలను తెలియజేయాలని బ్యాంకులను ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల స్వచ్ఛతను కాపాడేందుకు, అధిక ప్రచార ఖర్చులు, వస్తువుల పంపిణీని, అక్రమ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, మద్యం లేదా సంఘ విద్రోహశక్తుల తరలింపు నగదు లేదా వస్తు రూపంలో లంచం వంటి వాటిని తనిఖీ చేయడానికి ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, గణాంక తనిఖీ బృందాల కోసం ప్రామాణిక నిర్వహణ విధానం జారీ చేసినట్లు ఈసీ తెలిపింది. కాగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, గుజరాత్‌లో ఎన్నికల ప్రచార సమయంలో అభ్యర్థులు రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేయరాదని, అందుకోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుందని రాష్ట్ర సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రూ.10 వేల కంటే ఎక్కువ లావాదేవీలన్నీ చెక్కు, ఆర్‌టీజీఎస్ (రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్) లేదా డ్రాఫ్ట్ ద్వారానే జరగాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మేరకు గుజరాత్‌లోని మొత్తం 33 జిల్లాల్లోని వ్యయ పరిశీలన విభాగాల నోడల్ అధికారులు బ్యాంక్ సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. సీఈవో కార్యాలయం నుంచి లేఖ అందడంతో మెహసానా జిల్లా అభివృద్ధి అధికారి ఓం ప్రకాశ్ శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని ఆర్‌బీఐ నమోదు బ్యాంకులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రకాష్‌ను అక్కడ నోడల్ అధికారిగా నియమించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు అన్ని లావాదేవీలపై నిఘా ఉంచాలని చెప్పారు.

రూ.వంద కోట్లతో 'ఆదిపురుష్'కు మరమ్మతులు?

హైదరాబాద్: బాహుబలి సిరీస్ తో పాన్ ఇండియా హీరోగా మారిన రెబల్ స్టార్ ప్రభాస్ చాన్నాళ్లుగా మరో హిట్ కోసం ఎదురు చూస్తున్నాడు. బాహుబలి తర్వాత వచ్చిన సాహో, రాధేశ్యామ్ నిరాశపర్చడంతో, తన తదుపరి చిత్రం ఆదిపురుష్ పై అతను భారీ ఆశలు పెట్టుకున్నాడు. ఈ చిత్రంలో ప్రభాస్ రాముడిగా నటిస్తున్నాడు. బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ దర్శకత్వం వహిస్తున్నాడు. గత నెలలో ఈ చిత్రం టీజర్ విడుదలైంది. కానీ, దానిపై విమర్శలు వచ్చాయి. ప్రభాస్ లుక్ బాగాలేదని, టీజర్ లో విజువల్ ఎఫెక్ట్స్ తేలిపోయాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులను సంతృప్తి పరిచేందుకు చిత్ర బృందం కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వీఎఫ్ ఎక్స్, సీజీ వర్క్ లో తప్పిదాలను సరిచేసుకునే ప్రయత్నాలు చేస్తోందని తెలిసింది. ఏకంగా రూ. వంద కోట్ల ఖర్చుతో వీఎఫ్ ఎక్స్ షాట్స్ ను సరి చేస్తోందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రం విడుదల ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఈ మేరకు పోస్టర్స్, టీజర్ లో విడుదల తేదీని వెల్లడించింది. కానీ, ఇప్పుడు వీఎఫ్ ఎక్స్ తప్పులు సరి చేసేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో సంక్రాంతికి బదులు వేసవిలోనే చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. చిత్రం విడుదల వాయిదా పడుతుందని ఇప్పటికే వార్తలు వచ్చాయి.

మణిరత్నం దర్శకత్వంలో కమల్

చెన్నై: స్టార్ డైరెక్టర్ మణిరత్నంతో కొత్త సినిమా చేస్తున్నట్లు విశ్వనటుడు కమల్‌హాసన్ వెల్లడించాడు. ఇటీవల కమల్ నటించిన 'విక్రమ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ప్రస్తుతం కమల్ 'ఇండియన్ -2' లో నటిస్తు న్నాడు. ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. మరో నెల రోజుల్లో ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కానుంది. 'ఇండియన్-2' పూర్తి కాకముందే తన తదుపరి ప్రాజెక్ట్‌ను కమల్ ప్రకటించాడు. స్టార్ డైరెక్టర్ మణిరత్నంతో సినిమా చేయనున్నట్టు తెలిపాడు. కమల్ హాసన్, మణిరత్నం సినిమాను రెడ్ జెయింట్ పిక్చర్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. వర్కింగ్ టైటిల్‌గా 'కెహెచ్234' అని ప్రకటించింది. ఈ చిత్రానికి ఏఆర్. రెహమాన్ సంగీతం అందించనున్నాడు. ఈ చిత్రాన్ని రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ పిక్చర్స్ కలసి నిర్మించనున్నాయి. చిత్రీకరణ 2023 రెండో అర్ధభాగంలో ప్రారంభం కానుంది. 2024లో వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కమల్ హాసన్, మణిరత్నం కలసి గతంలో నాయకన్ సినిమాకు పనిచేశారు. ఈ చిత్రం 1987లో విడుదలైంది. ఆల్‌టైం క్లాసికల్ హిట్‌గా నిలిచిపోయింది. దాదాపుగా 35ఏళ్ల తర్వాత ఇద్దరు కలసి పనిచేయబోతుండటం విశేషం.

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన అలియా

ముంబై: బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ ఆదివారం పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. ముంబైలోని హెచ్ ఎన్ రిలయన్స్ ఫౌండేషన్ ఆసుపత్రిలో అలియా డెలివరీ జరిగిందని సమాచారం. తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం ఉదయం ఏడున్నరకు ఆమె అడ్మిట్ అయినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అలియా భట్ కు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తోటీ నటీనటులతో పాటు అభిమానులు సోషల్ మీడియాలో తమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆర్ ఆర్ ఆర్ సినిమాతో అలియా భట్ తెలుగు ప్రేక్షకులను పలకరించారు. ఈ సినిమాలో హీరో రామ్ చరణ్ ప్రేయసి సీత పాత్రలో అలియా నటించారు. అలియా, ఆమె భర్త రణబీర్ కపూర్ జంటగా తెరకెక్కిన సినిమా బ్రహ్మాస్త్రం ఇటీవలే తెలుగులో కూడా విడుదలైంది. రణబీర్ కపూర్ తో కొంతకాలం డేటింగ్ లో ఉన్న అలియా.. ఈ ఏడాది ఏప్రిల్ 14న వివాహం చేసుకున్నారు.

అగ్రస్థానంతో సెమీస్‌కు టీమిండియా

- జింబాబ్వేపై భారీ విజయం
- 10న ఇంగ్లండ్‌తో అమీతుమీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 క్రికెట్ ప్రపంకప్‌లో టీమిండియా సెమీస్ ప్రత్యర్థిని ఖరారు చేసుకుంది. ఆదివారం సూపర్-12 దశ గ్రూప్-2లో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 71 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. దీంతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన టీమిండియా... గ్రూప్-2లో రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌తో సెమీస్ లో తలపడనుంది. ఈ మ్యాచ్ నవంబరు 10న అడిలైడ్‌లో జరగనుంది. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా... 20 ఓవర్లలో 5 వికెట్లకు 186 పరుగులు చేయగా... 187 పరుగుల లక్ష్యఛేదనలో జింబాబ్వే చతికిలపడింది. 17.2 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టులో ర్యాన్‌బర్ల్-35, సికిందర్ రజా34 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. మిడిలార్డర్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ (25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సుతో 61 పరుగులు) వీర విహారానికి తోడు.. ఓపెనర్ కేఎల్ రాహుల్ (35 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులతో 51 పరుగులు) సమయోచిత ఇన్నింగ్స్ ఆడటంతో జింబాబ్వేకి భారత్ 187 పరుగులను లక్ష్యం గా నిర్దేశించింది. రిషబ్‌పంత్ (3) విఫలం కాగా, విరాట్ కోహ్లి 26, హార్దిక్ పాండ్య 18, రోహిత్ శర్మ 15 పరుగులు చేశారు. సూర్యకుమార్ యాదవ్ ఒక క్యాలెండర్ ఇయర్‌లో టీ20ల్లో 1000 పరుగులు పూర్తి చేసుకున్న తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. టీమిండియా బౌలర్లలో అశ్విన్ 3, షమీ 2, పాండ్యా 2, భువనేశ్వర్ కుమార్ 1, అర్షదీప్ సింగ్ 1, అక్షర్ పటేల్ 1 వికెట్ చొప్పున పడగొట్టారు. కాగా, ఈ విజయంతో భారత్ గ్రూప్-2లో 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. సూపర్-12 దశలో మొత్తం 5 మ్యాచ్ లు ఆడిన రోహిత్ సేన 4 మ్యాచ్ లు గెలిచి, ఒక్క దక్షిణాఫ్రికా చేతిలో ఓడింది. కాగా నవంబరు 9న జరిగే తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్, పాకిస్థాన్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. భారత్, పాకిస్థాన్ జట్లు సెమీఫైనల్లో పోటీల్లో నెగ్గితే, ఫైనల్ మ్యాచ్ ద్వారా మరోసారి మహాసంగ్రామం ఆవిష్కృతం కానుంది. సూపర్-12 దశలో దాయాదుల మధ్య జరిగిన మ్యాచ్ ఎంత రసవత్తరంగా జరిగిందో తెలిసిందే. ఈ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ నవంబరు 13న మెల్బోర్న్ మైదానంలో జరగనుంది.

బంగ్లాపై గెలుపుతో సెమీఫైనల్స్‌లోకి పాకిస్తాన్

అడిలైడ్: తొలి మ్యాచ్ లో భారత్, తర్వాత చిన్న జట్టు జింబాబ్వే చేతిలో కంగుతిన్న పాకిస్తాన్‌కు అదృష్టం కలిసొచ్చి సెమీఫైనల్ చేరుకుంది. నెదర్లాండ్స్ చేతిలో దక్షిణాఫ్రికా ఓడిపోవడంతో సెమీఫైనల్ చేరుకునే అవకాశాన్ని పాక్ రెండు చేతులా ఒడిసిపట్టుకుంది. ఆదివారం అడిలైడ్ లో జరిగిన సూపర్ 12 గ్రూప్ 2 మ్యాచ్ లో ఐదు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ను ఓడించి సెమీస్ చేరుకుంది.

మ్యాచ్‌లో టాస్ నెగ్గి బ్యాటింగ్ కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. ఓపెనర్ నజ్ముల్ హుస్సేన్ శాంటో (48 బంతుల్లో 7 ఫోర్లతో 54) అర్థ సెంచరీతో సత్తా చాటాడు. సౌమ్యా సర్కార్ (20), అఫిఫ్ హొస్సేన్ (24 నాటౌట్) రాణించారు. లిటన్ దాస్ (10), షకీబ్ అల్ హసన్ (0), మొసాదెక్ హొస్సేన్ (5), నురుల్ హసన్ (0), తస్కిన్ అహ్మద్ (1), నసుమ్ అహ్మద్ (7) నిరాశ పరిచారు. పాక్ బౌలర్లలో యువ పేసర్ షాహీన్ షా అఫ్రిది నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. షాదాబ్ ఖాన్ రెండు, ఇఫ్తికార్ అహ్మద్, హారిస్ రవూఫ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం పాకిస్తాన్ 18.1 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 128 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ మహ్మద్ రిజ్వాన్ (34), కెప్టెన్ బాబర్ ఆజమ్ (24), మొహమ్మద్ హారిస్ (31 నాటౌట్), షాన్ మసూద్ (24 నాటౌట్) రాణించారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు న్యూజిలాండ్ జట్టుతో తలపడనుంది.

నెదర్లాండ్స్ సంచలనం

అడిలైడ్: టీ20 ప్రపంచ కప్ కీలక మ్యాచ్ లో దక్షిణాఫ్రికా జట్టు చేతులెత్తేసింది. క్రికెట్ పసికూన నెదర్లాండ్స్ చేతిలో అనూహ్య ఓటమి చవిచూసింది. నెదర్లాండ్స్ బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు 159 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 145 పరుగులు మాత్రమే చేయగలిగింది. క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ నెదర్లాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. బ్రాండన్ గ్లోవర్ 3, ఫ్రెడ్ క్లాసెన్ 2 వికెట్లు, బాస్ డె లీడే 2, పౌల్ వాన్ మీకెరన్ 1 చొప్పున వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో 25 పరుగులు చేసిన రిలీ రూసో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా వారిలో డికాక్(13), బావుమా(20), మార్క్రమ్(17), డేవిడ్ మిల్లర్ (17), క్లాసెన్ (21), వేన్ పార్నెల్ (0), కేశవ్ మహరాజ్ (13), కగిసో రబడ(9 నాటౌట్), అన్రిచ్ నోర్జె (4 నాటౌట్) చొప్పున పరుగులు చేశారు. అంతకు ముందు నెదర్లాండ్స్ ఓపెనర్లు ఎంబర్గ్ (37), మ్యాక్స్ డౌడ్(29) పరుగులు చేసి జట్టుకు శుభారంభాన్ని అందించారు. ఆ తర్వాత వచ్చిన టామ్ కూపర్ (35), అకెర్‌మాన్(41 నాటౌట్), డీ లెడే(1), ఎడ్వర్డ్స్ (12 నాటౌట్) చొప్పున పరుగులు చేశారు. నెదర్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించిన అకెర్‌మాన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ ఓటమితో దక్షిణాఫ్రికా టీ20 టోర్నీ నుంచి నిష్క్రమించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.